

TGTEL/25/A2494

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 34 | హైదరాబాద్ | శుక్రవారం | 24-07-2026 | పేజీలు: 08


## టీజీ రెడ్కో డీజీఎంకు 14 రోజుల రిమాండ్

అక్రమాస్తుల కేసులో ముత్యం వెంకటరమణకు జ్యుడీషియల్ రిమాండ్

ఏసీబీ కోర్టులో హాజరుపర్చిన అధికారులు

చంచల్‌గూడ జైలుకు తరలించిన అధికారులు

2019 లంచం కేసు విచారణ కొనసాగుతుండగానే మరోసారి చిక్కిన అధికారి



02

## కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే

ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్‌కు భారత్ కౌంటర్

సీమాంతర ఉగ్రవాదంపై ఐరాస వేదికగా నిలదీత

ఐరాస భద్రతా మండలిలో పాకిస్థాన్‌కు చురకలు

ఉగ్రవాదాన్ని విదేశాంగ విధానంగా వాడుకుంటోందని విమర్శ

పీఓకే ఖాళీ చేయడమే ఏకైక సమస్య అని స్పష్టత



03

## యుద్ధానికి 95 బిలియన్ డాలర్ల బడ్జెట్

అమెరికా ప్రతినిధుల సభ ఆమోదం

ట్రంప్ నిర్ణయంపై రాజకీయ దుమారం

ఇరాన్ యుద్ధానికి భారీగా నిధులు

స్వల్ప మెజారిటీతో గట్టెక్కిన బిల్లు

సొంత పార్టీలోనే వ్యక్తమైన భిన్నాభిప్రాయాలు

యుద్ధం కాదు.. ప్రజా సంక్షేమమే ముఖ్యం

ట్రంప్ వైఖరిపై విరుచుకుపడ్డ డెమోక్రాట్లు



03

# ఓటర్ల ప్రక్షాళన పక్కాగా జరగాలి

కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై సంచలన వ్యాఖ్యలు

రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రక్షాళన అత్యంత కీలకం

విలేకరుల ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు

నాకు రెండు ఓట్లు ఉంటే ఫిర్యాదు చేయండి

తప్పుడు ఫిర్యాదులు చేస్తే జైలుకేనని హెచ్చరిక

కొడంగల్ నుండి ఓటు బదిలీ దరఖాస్తు

గ్లోబరీనా కేటీఆర్ బినామీ సంస్థేనని మరోసారి వ్యాఖ్య

బీఆర్ఎస్, బీజేపీలపై సీఎం రేవంత్ నిప్పులు



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ అత్యంత ముఖ్యమైనదని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులకు గట్టిగా స్పష్టం చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. శాసనసభ ఆవరణలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 70 శాతం ప్రత్యేక సమగ్ర సమీక్ష (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన 30 శాతం పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. చిన్న చిన్న వ్యత్యాసాలు ఉంటే అది ఓటరు సవరణ కిందకు రాదని, ఓటు హక్కు లేకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందే అవకాశం ఉండదని ఆయన వివరించారు.

ఓటర్ల ప్రక్షాళన పేరుతో అర్హులైన వారి ఓట్లను తొలగించే అవకాశం ఉందన్న మిగతా 2లో..

# గ్లోబరీనాతో నాకు సంబంధం లేదు

కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

సీఎం రేవంత్‌కు ఇప్పటికే నోటీసు

కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పందంపై ప్రశ్నలు

సీఎం రేవంత్ వైఖరిపై నిలదీత

బీజేపీతో దోస్తీపై తీవ్రస్థాయి విమర్శలు

లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమని ప్రకటన



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

గ్లోబరీనా (గ్లోబల్ ఏరినా) సంస్థ తన బినామీ కంపెనీ అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పూర్తిగా తోసిపుచ్చారు. ఆ సంస్థతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆధారాలు లేని అసత్య ఆరోపణలు చేసినందుకు ముఖ్యమంత్రికి ఇప్పటికే పరువు నష్టం (డిఫమేషన్) లీగల్ నోటీసు పంపినట్లు వెల్లడించారు. వరంగల్ జిల్లా మడికొండలో గురువారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మీడియాతో జరిపిన చిట్‌చాట్‌లో కేటీఆర్ ఈ విషయాలపై ఘాటుగా స్పందించారు.

గ్లోబరీనా సంస్థ నిజంగానే తన బినామీ సంస్థ అయితే, అదే కంపెనీతో ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అధికారిక మిగతా 2లో..



## పేపర్ లీక్ దోషులకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు

'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ సంచలన ప్రకటన

నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో ప్రధాని మోదీ స్పందన

యువత భవిష్యత్తే మాకు తొలి ప్రాధాన్యం

పేపర్ లీక్ దోషులకు కఠిన శిక్షల కోసం ఫాస్ట్ ట్రాక్

02



02

## నీట్ లీక్‌పై భగ్గుమన్న విపక్షాలు

విద్యా వ్యవస్థను నాశనం చేశారన్న రాహుల్, ఖర్గే

విద్యాశాఖ మంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలి

కేంద్రం ముందు రాహుల్ గాంధీ 3 ప్రధాన డిమాండ్లు

మోదీ హయాంలో విద్యా వ్యవస్థ క్షీణించింది

క్రూరంగా ప్రవర్తిస్తున్నారని మల్లికార్జున ఖర్గే ఆగ్రహం

ఆర్ఎస్ఎస్ చేతుల్లోకి విద్యా రంగం

ఏసీ గదులు వీడి యువత కళ్లలోకి చూడాలని ఖర్గే హితవు

# భాగ్యనగరంలో పేదలకు 'ఇందిరమ్మ టవర్స్'

రూ. 60 లక్షల ఇల్లు కేవలం రూ. 6 లక్షలకే

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కీలక ప్రకటన

హైదరాబాద్ పేదలకు సొంతింటి కల దిశగా అడుగులు

కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో నాణ్యమైన గృహాలు

అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష

లబ్ధిదారుల ఎంపికలో బలహీన వర్గాలకు పెద్దపీట

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్ మహానగరంలో సొంత ఇల్లు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేద మరియు దిగువ మధ్యతరగతి కుటుంబాలకు శాశ్వత గృహ భద్రత కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నగరంలో నివసిస్తున్న పేదలకు గౌరవప్రదమైన రీతిలో, అందుబాటు ధరల్లో అత్యాధునిక 'ఇందిరమ్మ టవర్స్' నిర్మించి అందించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు.

గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, దరఖాస్తుల స్వీకరణ, అమలు విధానంపై ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరంలో అత్యంత విలువైన కోట్ల రూపాయల ప్రభుత్వ భూములను వ్యాపార ప్రయోజనాలకు కాకుండా, ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తున్నామని స్పష్టం చేశారు. నిరుపేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అతి సమీపంలోనే గృహాలు నిర్మించేలా ఒక్కో నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

లబ్ధిదారులపై ఏమాత్రం ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం రూ. 5 లక్షల సబ్సిడీని నేరుగా అందిస్తోందని మంత్రి తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో రూ. 40 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు విలువ చేసే నాణ్యమైన ఫ్లాట్‌ను, లబ్ధిదారుడి వాటా కింద కేవలం రూ. 6 లక్షల స్వల్ప మొత్తానికే అందించనున్నారు. ఎస్ఆర్‌వో (SRO) బేసిక్ విలువ ప్రకారమే రూ. 14.6 లక్షల నుంచి రూ. 28.4 లక్షల వరకు విలువ చేసే ఈ భూమి, నిర్మాణ వ్యయంలో సింహభాగాన్ని ప్రభుత్వమే భరిస్తుండటంతో పేదలకు నామమాత్రపు ధరలోనే డబుల్ బెడ్‌రూమ్ మిగతా 2లో..



## కేంద్ర జలశక్తి మంత్రితో బీజేపీ ఎంపీల భేటీ

కాళేశ్వరం, గోదావరి-కావేరి అనుసంధానంపై తీవ్ర చర్చ

తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై ఢిల్లీలో చర్చలు

కిషన్ రెడ్డి, ఈటల, కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరుల హాజరు

కాళేశ్వరం వివాదం చుట్టూ తిరుగుతున్న రాష్ట్ర రాజకీయం

ఎన్డీఎస్ఏ ఆదేశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత

మేడిగడ్డ, అన్నారం గేట్లెత్తి ఉంచడంపై సీఎం వ్యాఖ్యలు

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్రానికి చెందిన భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యుల బృందం గురువారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో అత్యంత ప్రాధాన్యత కలిగిన సమావేశాన్ని నిర్వహించింది. కేంద్ర మంత్రి నివాసంలో జరిగిన ఈ భేటీలో తెలంగాణలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు, వాటి ప్రస్తుత పరిస్థితి మరియు పెండింగ్ మిగతా 3లో..



# కార్పొరేట్ సంస్థలకు దీటుగా గురుకులాలు

విద్యార్థుల సంక్షేమంలో తగ్గే ప్రసక్తే లేదు

స్పష్టం చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్

కార్పొరేట్‌కు పోటీగా గురుకులాలు

సరూర్‌నగర్ విక్టోరియా మెమోరియల్‌లో తనిఖీ

పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదు

విద్యార్థులకు వెల్‌కమ్ కిట్ల పంపిణీ

డైట్ ఛార్జీల పెంపుతో పౌష్టికాహారం

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలను ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని రీతిలో అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని తెలంగాణ రాష్ట్ర సాంఘిక, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ విద్యాసంస్థను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ మిగతా 3లో..



# పేపర్ లీక్ దోషులకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు



- 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ సంచలన ప్రకటన
- నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో ప్రధాని మోదీ స్పందన
- యువత భవిష్యత్తే మాకు తొలి ప్రాధాన్యం
- పేపర్ లీక్ దోషులకు కఠిన శిక్షల కోసం ఫాస్ట్ ట్రాక్
- క్షేత్రస్థాయి ఆదేశాలిచ్చిన ప్రధాని
- కేంద్రం ముందుకు సీజేపీ తీవ్ర డిమాండ్లు
- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు పట్టు
- ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలకు కోటి పరిహారం

**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**

దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్న నీట్ ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ అంశంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా అత్యంత తీవ్రంగా స్పందించారు. దేశంలో ఉన్న లక్షలాది మంది విద్యార్థులు, యువత భవిష్యత్తు కంటే తమ ప్రభుత్వానికి మరేదీ ముఖ్యం కాదని స్పష్టం చేశారు. దేశ ఆశలైన యువత ప్రయోజనాలను కాపాడటమే తమ మొదటి ప్రాధాన్యమని పేర్కొన్నారు. అక్రమాలకు పాల్పడి అభాగ్య విద్యార్థుల ఆశలతో ఆడుకునే ఎంతటి బడా పేపర్ లీక్ మాఫియానైనా, దోషులనైనా విడిచిపెట్టే ప్రసక్తే లేదని అత్యంత కఠిన స్వరంతో హెచ్చరించారు.పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడిన నిందితులను త్వరిత గతిన విచారించి బాధ్యులకు కఠిన శిక్షలు పడేలా చూసేందుకు ప్రత్యేకంగా 'ఫాస్ట్ ట్రాక్ కోర్టులను' ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర చర్యల పరంపరలో ఇది ఒక ప్రధాన నిర్ణయమని వెల్లడించారు. ఈ దిశగా అవసరమైన చట్టపరమైన, పరిపాలనాపరమైన ఏర్పాట్లు వేగవంతం చేయాలని సంబంధిత శాఖల ఉన్నతాధికారులను ఆదేశించినట్లు చెప్పారు. పరీక్షా విధానంలో పారదర్శకత పునరుద్ధరించేందుకు తాము ఏమాత్రం రాజీపడబోమని విద్యార్థులకు, తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. మరోవైపు, నీట్ అక్రమాలపై దేశ రాజధానిలో పోరాడుతున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధి సౌరవ్ దాస్ కేంద్ర ప్రభుత్వం ముందుకు మూడు ప్రధాన డిమాండ్లను ఉంచారు. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టిన నీట్ లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి రాజీనామా విషయంలో తాము ఎలాంటి బేరసారాలకు సిద్ధంగా లేమని, మంత్రి దిగిపోయే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.

పేపర్ లీకేజీ వార్తలు, పరీక్షల్లో అక్రమాలతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్న బాధితులైన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే రూ. కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సీజేపీ రెండవ డిమాండ్‌గా పేర్కొంది. అలాగే, న్యాయం కోసం ఢిల్లీ వీధుల్లో శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న విద్యార్థులు, నాయకులపై పోలీసులు పెట్టిన అక్రమ ఎఫ్ఐఆర్‌లను వెంటనే ఎత్తివేయాలని మూడో డిమాండ్‌గా కోరింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్ తన నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారని, ఈ పోరాటాన్ని శాంతియుత మార్గంలోనే ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు.

పరీక్షల లీకేజీలు, విద్యా వ్యవస్థలో రాజ్యమేలుతున్న అక్రమాలకు వ్యతిరేకంగా సీజేపీ కార్యకర్తలు, వేలాది మంది విద్యార్థులు ఢిల్లీ వీధుల్లోకి రావడంతో దేశ రాజధాని నిరసనలతో అట్టుడుకుతోంది. ముఖ్యంగా ఢిల్లీలోని టాల్‌స్టాయ్ మార్గ్, జన్‌పథ్ ప్రాంతాల్లో విద్యార్థులు భారీ ప్రదర్శనలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లతో పాటు ఢిల్లీ పోలీసుల తీరుకు వ్యతిరేకంగా బిగ్గరగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో నిరసనకారులు రోడ్లపై ధర్నాకు దిగడం, కదులుతున్న వాహనాలను, బస్సులను అడ్డుకోవడంతో రాజధానిలోని ప్రధాన మార్గాల్లో గంటల తరబడి భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ నిరసనల్లో పాల్గొంటున్న విద్యార్థుల ఆవేదన వర్ణనాతీతంగా ఉంది. బిహార్ నుంచి వచ్చిన ఒక నిరసనకారుడు మాట్లాడుతూ, తాను దాదాపు నెల రోజులుగా ఇల్లు వాకిలి వదిలి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనల్లో పాల్గొంటున్నానని తెలిపాడు. తమ డిమాండ్లు నెరవేరే వరకు ఇక్కడి నుంచే పోరాడతానని తెగేసి చెప్పాడు. ప్రజలకు రక్షణగా నిలవాల్సిన పోలీసులు తమపై లాఠీఛార్జ్ చేయడం దారుణమని, సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నాలను విడిచిపెట్టి వెంటనే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పట్టుబట్టాడు. ఈ ప్రజా ఉద్యమం కేవలం నీట్ పరీక్షకు మాత్రమే పరిమితం కాకుండా, దేశంలోని అన్ని పోటీ పరీక్షలలో ఉన్న లోపాలను నిలదీసే స్థాయికి విస్తరించింది. నిరసనలో పాల్గొన్న ఒక యూపీ పీసీఎస్ ఆశావహుడు మాట్లాడుతూ.. పద్ధతి లేని నార్మలైజేషన్, పర్సంటైల్ లెక్కింపుల వల్ల తాను కేవలం 0.3 మార్కుల స్వల్ప తేడాతో అర్హత కోల్పోయానని వాపోయాడు. పోటీ పరీక్షల నిర్వహణ వ్యవస్థలలో ఉన్న అస్పష్టతను, లీకేజీల సంస్కృతిని పూర్తిగా రూపుమాపాలని, కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశాడు.

# భాగ్యనగరంలో పేదలకు 'ఇందిరమ్మ టవర్స్'

**మొదటిపేజీ తరువాయి**

తరహా ఇళ్లు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఇందిరమ్మ టవర్స్ గృహాల కేటాయింపులో సమాజంలోని వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వం 50 శాతం రిజర్వేషన్లను ఖరారు చేసింది. ఇందులో భాగంగా పారదర్శకంగా ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5 శాతం, బీసీలకు 16 శాతం మరియు దివ్యాంగులకు 5 శాతం చొప్పున కేటాయించనున్నారు. మిగిలిన 50 శాతం గృహాలను జనరల్ కేటగిరీ పరిధిలోకి తెచ్చి, అర్హులైన నిరుపేద కుటుంబాలకు పారదర్శక పద్ధతిలో అందజేస్తామని మంత్రి పేర్కొన్నారు. మహిళా సాధికారతను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం ఇండ్ల కేటాయింపుల్లో మరో కీలక నిబంధనను పొందుపరిచింది. రిజర్వేషన్ కేటగిరీలలోని మొత్తం ఫ్లాట్లలో 30 శాతం గృహాలను తప్పనిసరిగా మహిళల పేరిటే కేటాయించనున్నారు. కుటుంబానికి ఆర్థిక మరియు సామాజిక భద్రత కల్పించడంలో మహిళల పాత్ర కీలకమైనందున, వారిపేరిట ఇండ్ల రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని, దీనివల్ల వేలాది కుటుంబాల్లో మహిళలకు యాజమాన్య హక్కులు లభిస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకునే అర్హులైన పౌరుల సౌకర్యార్థం ప్రభుత్వం డిజిటల్ విధానాలను అందుబాటులోకి తెచ్చింది. అర్హులు తమ సమీపంలోని మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చు. అంతేకాకుండా, మీసేవ ప్రత్యేక వాట్సాప్ నంబర్ 8096958096కు సందేశం పంపడం ద్వారా లేదా అధికారిక వెబ్‌సైట్ ([http://meeseva.telangana.gov.in](http://meeseva.telangana.gov.in)) ద్వారా కూడా ఇంట్లో నుంచే ఉచితంగా దరఖాస్తు చేసుకునే వీలు కల్పించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ అత్యంత సులభంగా, పారదర్శకంగా సాగుతుందని స్పష్టం చేశారు. నగర పరిధిలో తొలి విడతగా ఎంపిక చేసిన 16 ప్రధాన శాసనసభ నియోజకవర్గాల్లో ఈ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులను ముమ్మరం చేయనున్నారు. నగరాల్లోని మురికివాడలు, అద్దె ఇండ్లలో మగ్గుతున్న కుటుంబాలకు రక్షణతో కూడిన పక్కా గృహాలు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు గణనీయంగా పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకుండా, అన్ని మౌలిక వసతులతో కూడిన మోడల్ కాలనీలుగా వీటిని తీర్చిదిద్దాలని అధికారులకు మంత్రుల బృందం ఆదేశాలు జారీ చేసింది. సమాజ సేవలో నిరంతరం శ్రమిస్తున్న దిగువ స్థాయి ఉద్యోగులకు ప్రభుత్వం ఈ పథకంలో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చింది. ప్రభుత్వ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, నాలుగో తరగతి (క్లాస్4) ఉద్యోగులు మరియు నగర పారిశుధ్య కార్మికులకు ప్రత్యేకంగా 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు ప్రకటించింది. నగర పరిశుభ్రతకు, పాలనా యంత్రాంగానికి వెన్నుముకగా నిలిచే ఈ శ్రమజీవులకు సొంతింటి కల నెరవేరేలా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై కార్మిక సంఘాలు, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఓటర్ల ప్రక్షాళన పక్కాగా జరగాలి

**మొదటిపేజీ తరువాయి**

ఆందోళనపై సీఎం స్పందించారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారి ఓట్లను అక్రమంగా తొలగించారని గుర్తుచేశారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, ఉన్నత న్యాయస్థానం నాటి జీహెచ్ఎంసీ కమిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిందని వివరించారు. తన పేరు మీద రెండు చోట్ల ఓట్లు ఉన్నట్లు భావిస్తే ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని, ఒకవేళ కావాలని రాజకీయ కారణాలతో తప్పుడు ఫిర్యాదులు చేస్తే మాత్రం అటువంటి వారిని చట్ట ప్రకారం లోపల వేయిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు.తాను కూడా తన ఓటును బదిలీ చేయించుకోవడానికి సంబంధిత జిల్లా కలెక్టర్‌కు అధికారికంగా దరఖాస్తు చేసుకున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా కొడంగల్ ప్రాంత చరిత్రను గుర్తుచేస్తూ.. గతంలో కొడంగల్ కర్ణాటక రాష్ట్ర పరిధిలో ఉండేదని, భాషా ప్రయుక్త రాష్ట్రాల విభజన సమయంలో అది తెలంగాణ ప్రాంతంలోకి వచ్చి చేరిందని తెలిపారు. ప్రతి బూత్ స్థాయిలో ఓట్లు చెల్లాచెదురు కాకుండా, అక్రమంగా తొలగించబడకుండా చూడటానికి బూత్ లెవెల్ ఆఫీసర్ల (బీఎల్ఓ)కు అనుసంధానంగా కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లను (బీఎల్ఏ) నియమించినట్లు చెప్పారు. ఎస్ఐఆర్‌పై అవగాహన రాహిత్యం ఉన్నందున ఈ చర్యలు తీసుకున్నామన్నారు.

హైదరాబాద్ రాజధాని నగరంలో 'హైడ్రా' వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తోందని, ఆక్రమణలకు గురైన అనేక విలువైన ప్రభుత్వ ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకుందని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నాయకత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను బీఆర్ఎస్ పెద్దలు గాలికి వదిలేశారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వందల కోట్లు దండుకున్నందుకే హరీశ్‌రావును ఆయన మామ కేసీఆర్ మంత్రి పదవి నుంచి పక్కనబెట్టారని సంచలన ఆరోపణ చేశారు. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకున్న వారు ఎవరూ రక్తం ఇవ్వలేదని, ఇచ్చిన వాళ్లంతా బడా పెద్దలేనని, ఆ రక్తాన్ని ఎవరికి అమ్ముకున్నారో సమాధానం చెప్పాలని వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

వివాదాస్పద గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీ కంపెనీయేనని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ విషయంలో కేటీఆర్ తన నిజాయితీని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో గ్లోబరీనా సంస్థ ఇంటర్మీడియట్ మార్కుల కేటాయింపు, పేపర్ల మూల్యాంకనంలో తీవ్ర అక్రమాలకు పాల్పడటం వల్లే మనస్తాపంతో 27 మంది అమాయక విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

27 మంది విద్యార్థుల మరణానికి కారణమైనందుకు కేటీఆర్ విద్యార్థుల తల్లిదండ్రులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, గన్ పార్క్ వద్ద ఉన్న గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. పరువు ఉన్నవాడే పరువు నష్టం దావా వేస్తాడని కేటీఆర్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు.

దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో బీఆర్ఎస్ పార్టీ అవలంబిస్తున్న వైఖరిని ముఖ్యమంత్రి తీవ్రంగా తప్పుపట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ, విద్యార్థులు దేశవ్యాప్తంగా పోరాడుతుంటే.. బీఆర్ఎస్ నాయకులు మాత్రం ఎందుకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేయడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీలు లోపాయికారీగా ఒక్కటై పనిచేస్తున్నాయని ఆరోపించారు. రాజధానిలోని జన్వాడ ఫామ్‌హౌస్‌లో ఏ రాజుల భూములు ఉన్నాయో స్వయంగా కేటీఆర్‌నే అడగాలని, అక్రమాలను ఒక్కొక్కటిగా బయటకు తీస్తామన్నారు.ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై శాసనసభ వేదికగా కేటీఆర్ తమను ప్రశ్నించాలని, అప్పుడు పేర్లతో సహా తాము చేపట్టిన నియామకాల పూర్తి జాబితాను అసెంబ్లీ ముందే ఉంచుతామని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 55 రోజుల్లోనే పారదర్శకంగా 11 వేల మందికి పైగా ఉపాధ్యాయ (డీఎస్సీ) ఉద్యోగాలను భర్తీ చేసినట్లు గర్వంగా చెప్పారు. నోటిఫికేషన్లు ఇవ్వడం, పేపర్లు లీక్ చేయడం, ఆపై అభ్యర్థుల నుంచి సొమ్ము చేసుకోవడమే గత బీఆర్ఎస్ ప్రభుత్వ నైజమని ఘాటుగా విమర్శించారు. అలాగే రాష్ట్రంలో ప్రజా ఆరోగ్యానికి హాని కలిగించే ఆహార కల్తీపై తమ ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రజలు, ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ఇందిరా పార్క్ వద్ద ఉన్న ధర్నా చౌక్‌ను మూసివేశారని, తమ కాంగ్రెస్ 'ప్రజా ప్రభుత్వం' అధికారంలోకి వచ్చాకే ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తూ ధర్నా చౌక్‌ను తిరిగి తెరిచామని సీఎం తెలిపారు. తాము తెరిచిన అదే ధర్నా చౌక్‌లో రేపు కేటీఆర్ ధర్నా చేస్తానని అనడం ఎంత విడ్డూరమో ప్రజలు గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కేటీఆర్ 50 వేల మెజార్టీ వస్తుందని ప్రగల్భాలు పలికారాని, కానీ కాంగ్రెస్ పార్టీయే 30 వేల మెజార్టీతో గెలుస్తుందని తాను ముందే చెప్పానని గుర్తుచేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరైనా ముందుకు వచ్చి లక్ష కోట్లు పెట్టుబడి పెడితే, గౌరవార్థం ఆయా ప్రధాన రహదారులకు వారి పేర్లు పెడతామని స్పష్టం చేశారు.

# నీట్ లీక్‌పై భగ్గుమన్న విపక్షాలు

- విద్యా వ్యవస్థను నాశనం చేశారన్న రాహుల్, ఖర్గే
- విద్యాశాఖ మంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలి
- కేంద్రం ముందు రాహుల్ గాంధీ 3 ప్రధాన డిమాండ్లు
- మోదీ హయాంలో విద్యా వ్యవస్థ క్షీణించింది
- క్రూరంగా ప్రవర్తిస్తున్నారని మల్లిఖార్జున ఖర్గే ఆగ్రహం
- ఆర్ఎస్ఎస్ చేతుల్లోకి విద్యా రంగం
- ఏసీ గదులు వీడి యువత కళ్లలోకి చూడాలని ఖర్గే హితవు

**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**



దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సాగిస్తున్న ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై విపక్షాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. మన దేశపు విద్యా వ్యవస్థను కేంద్రం పూర్తిగా నాశనం చేయడమే కాకుండా, అక్రమాలకు పాల్పడిన దోషులను స్వయంగా ప్రభుత్వమే కాపాడుతోందని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేశంలో యువత భవిష్యత్తును ప్రస్తుత ప్రభుత్వం అత్యంత దారుణంగా దెబ్బతీసిందని తీవ్రంగా ధ్వజమెత్తారు. ఈ సంక్షోభ పరిణామాలపై విద్యార్థుల తరపున రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వం ముందు మూడు స్పష్టమైన డిమాండ్లను ఉంచారు. మొదటిది నీట్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలి. రెండవది జరిగిన పరిణామాలపై, నష్టపోయిన విద్యార్థులకు ప్రభుత్వం బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. మూడవది జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అమాయక విద్యార్థులపై దాడులకు, లాఠీఛార్జీకి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కూడా కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశంలో విద్యా వ్యవస్థ పూర్తిగా క్షీణించిపోయిందని విమర్శించారు. తమ హక్కులు, పారదర్శక పరీక్షల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువత పట్ల పోలీసులు, ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా, అత్యంత క్రూరంగా ప్రవర్తించాయని దుయ్యబట్టారు. విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడం ద్వారా ప్రభుత్వం తమ అసమర్థతను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని ఖర్గే ఆరోపించారు.

కేంద్ర పాలకులు తమ ఏసీ గదుల్లోంచి బయటకు వచ్చి, నియంతృత్వానికి వ్యతిరేకంగా వీధుల్లో రక్తం చిందించిన యువతీ యువకుల కళ్లలోకి నేరుగా చూడాలని ఖర్గే హితవు పలికారు. విద్యార్థులు కోరుతోంది కేవలం విఫలమైన విద్యాశాఖ మంత్రి తొలగింపు మరియు పారదర్శకమైన పరీక్షల నిర్వహణ మాత్రమేనని చెప్పారు. దేశంలో విద్యా వ్యవస్థను ఆర్ఎస్ఎస్ (RSS) పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుందని, ఫలితంగా విద్యా ప్రమాణాలు పడిపోయి నిరుద్యోగం ఆకాశాన్నంటుతోందని మండిపడ్డారు. ఉపాధి పేరిట కాంట్రాక్టు పద్ధతిని పరాకాష్టకు తీసుకెళ్లారని ఆయన విమర్శించారు.

కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా కేంద్ర ప్రభుత్వ వైఖరిపై సంచలన పోస్ట్ చేశారు. నీట్ పేపర్ లీకేజీపై రాహుల్ గాంధీ లేవనెత్తిన సూటి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక కేంద్ర ప్రభుత్వం తీవ్ర భయానికి గురవుతోందని వ్యాఖ్యానించారు. రాహుల్ వ్యాఖ్యలను తిప్పికొట్టేందుకు కేంద్ర మంత్రి జేపీ నడ్డా హుటాహుటిన మీడియా సమావేశం ఏర్పాటు చేశారని, అయితే ఆ ప్రెస్ మీట్ అంతా కేవలం గత ప్రభుత్వాల తప్పులను ఎత్తిచూపడానికే సరిపోయిందని ఎద్దేవా చేశారు. ప్రస్తుత సమస్యకు సరైన సమాధానం చెప్పలేకపోవడం ప్రభుత్వ భయానికి నిదర్శనమన్నారు. మోదీ ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకొచ్చిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఒక విఫల వ్యవస్థగా మారిందని జైరాం రమేశ్ ఆరోపించారు. ఎన్టీఏ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు కనీసం 9 సార్లు వేర్వేరు పోటీ పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయని గుర్తుచేశారు. తాజాగా నీట్ పరీక్షలోనూ భారీ అక్రమాలు వెలుగు చూశాయన్నారు. ఎన్టీఏ సంస్కరణల కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డాక్టర్ కె. రాధాకృష్ణన్ కమిటీ ఏకంగా 101 కీలక సిఫార్సులతో నివేదిక సమర్పించినప్పటికీ, ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన దుయ్యబట్టారు.

దేశ రాజధాని ఢిల్లీలో న్యాయబద్ధంగా, శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేయడాన్ని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో విద్యార్థుల గొంతు నొక్కడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో వెల్లువెత్తుతున్న విద్యార్థుల ఆగ్రహం కేవలం ఒక పరీక్షకు సంబంధించింది మాత్రమే కాదని, ప్రధాని నరేంద్ర మోదీ అసమర్థతపై, ఆయన హయాంలో విఫలమైన విద్యా విధానాలపై విద్యార్థులు చూపుతున్న తిరుగుబాటు అని స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీక్ ఘటన మరియు విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో విపక్షాలు తమ నిరసన సెగను పార్లమెంట్‌కు సైతం వ్యాపింపజేశాయి. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ గురువారం పార్లమెంట్ ప్రాంగణంలో ప్రతిపక్ష ఎంపీలు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్లకార్డులు చేతబూని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ స్వయంగా పాల్గొని విద్యార్థుల పోరాటానికి తమ మద్దతు తెలిపారు.

# గ్లోబరీనాతో నాకు సంబంధం లేదు

**మొదటిపేజీ తరువాయి**

ఒప్పందాలు చేసుకుందో సమాధానం చెప్పాలని కేటీఆర్ నిలదీశారు. ఒకవైపు సదరు సంస్థతో కాంగ్రెస్ సర్కార్ ఒప్పందాలు కుదుర్చుకుంటూ, మరోవైపు రాజకీయ స్వార్థం కోసం అది తన బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి ఆరోపించడం ఆయన ద్వంద్వ నీతికి నిదర్శనమని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చేస్తున్న విమర్శల్లో ఎలాంటి నిజాయితీ లేదని, కేవలం ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇటువంటి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ వైఖరిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి పగటిపూట కాంగ్రెస్ పార్టీ నేతగా నటిస్తూ, రాత్రి వేళల్లో బీజేపీ నాయకులతో సత్సంబంధాలు నెరపుతున్నారని ఆరోపించారు. "ప్రస్తుతం తెలంగాణలో రేవంత్ రెడ్డి మార్కు పాలన సాగుతోంది. కాంగ్రెస్ అధిష్టానానికి ఒక మూట పంపితే, బీజేపీ పెద్దలకు రెండు మూటలు పంపుతున్నారు" అని వ్యాఖ్యానిస్తూ సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్ర వనరులను తన రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు.గ్లోబరీనా వ్యవహారం మరియు ఇతర ఆరోపణలపై తాను ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ ప్రకటించారు. సిఐడి విచారణను ఎదుర్కోవడానికి తాను పూర్తి సిద్ధంగా ఉన్నానని, అంతకంటే ముందడుగు వేసి అవసరమైతే లై డిటెక్టర్ (లై డిటెక్షన్) పరీక్షకు కూడా తాను సిద్ధమని సీఎంకు బహిరంగ సవాల్ విసిరారు. నిజాయితీ నిరూపించుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ధైర్యం ఉంటే లై డిటెక్టర్ పరీక్షకు రావాలని సవాల్ విసిరారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని, ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కనీసం మోదీ పేరును ప్రస్తావించడానికి కూడా భయపడుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గతంలో తనపై ఉన్న పాత కేసులు, అమృత్ పథకం కాంట్రాక్టులు, ఇతర కుటుంబ ప్రయోజనాలను కాపాడుకోవడం కోసమే రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో లోపాయికారీగా రాజీ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రంపై పోరాడాల్సిన సమయంలో మోదీకి లొంగిపోయి పనిచేస్తున్నారని విమర్శించారు.ప్రతిపక్ష నేతలపై అబద్ధపు కేసులు, విచారణలు అంటూ బెదిరింపులకు దిగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తన సొంత కుటుంబంపై వస్తున్న భారీ అవినీతి ఆరోపణలపై విచారణకు సిద్ధపడాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ప్రత్యేక విచారణ బృందం (సిట్) లేదా సీఐడీ విచారణ వేయడానికి ముఖ్యమంత్రికి ధైర్యం ఉందా అని ప్రతిసవాల్ విసిరారు. తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి విపక్షాలపై నిందలు వేయడం కాంగ్రెస్ నాయకులకు అలవాటుగా మారిందన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాజ్‌భవన్ ముట్టడి లేదా ధర్నా నిర్వహించాల్సింది పోయి, ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో ధర్నాలు చేయడం కేవలం ఒక రాజకీయ నాటకమని కేటీఆర్ కొట్టిపారేశారు. ప్రజలను మభ్యపెట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలు ఆడుతోందని దుయ్యబట్టారు. రాష్ట్ర సమస్యలపై పోరాడే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి లేదని, కేవలం వార్తల్లో నిలవడం కోసమే ఇటువంటి విన్యాసాలు చేస్తున్నారని విమర్శించారు.గ్లోబరీనా సంస్థపై తనను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలన్నీ కేవలం బురదజల్లే యత్నమేనని కేటీఆర్ పునరుద్ఘాటించారు. సీఎం చేసిన ఆరోపణలను తక్షణమే ఆధారాలతో సహా రుజువు చేయాలని, లేనిపక్షంలో తెలంగాణ సమాజానికి మరియు తనకూ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పరువు నష్టం నోటీసు పంపినందున, చట్టపరంగా కూడా ముఖ్యమంత్రిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# టీజీ రెడ్కో డీజీఎంకు 14 రోజుల రిమాండ్

- అక్రమాస్తుల కేసులో ముత్యం వెంకటరమణకు జ్యుడీషియల్ రిమాండ్
- ఏసీబీ కోర్టులో హాజరుపర్చిన అధికారులు
- చంచల్‌గూడ జైలుకు తరలించిన అధికారులు
- 2019 లంచం కేసు విచారణ కొనసాగుతుండగానే మరోసారి చిక్కిన అధికారి
- రూ.28.14 కోట్ల ఆదాయానికి మించిన ఆస్తులు గుర్తించిన ఏసీబీ
- బహిరంగ మార్కెట్‌లో ఆస్తుల విలువ రూ.200 కోట్లకు పైగా ఉండొచ్చని అంచనా
- ఏసీబీ చరిత్రలోనే భారీ అక్రమాస్తుల కేసుల్లో ఒకటిగా నమోదు

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) ముత్యం వెంకటరమణకు ఏసీబీ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో బుధవారం అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు గురువారం ఆయనను ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు.ఆరున్నర దశాబ్దాల ఏసీబీ చరిత్రలో అత్యంత భారీ అక్రమాస్తుల కేసుల్లో ఇదొకటిగా నిలిచింది. ఇటీవల రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం రూ.17.94 కోట్ల ఆదాయానికి మించిన ఆస్తులతో పట్టుబడిన ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ మోహన్‌నాయక్ కేసు రికార్డును టీజీ రెడ్కో డీజీఎం వెంకటరమణ అధిగమించినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

వెంకటరమణ గతంలో 2019లో లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. ఆ కేసు కోర్టులో విచారణలో ఉండగానే మరోసారి ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలో ఏసీబీ దాడుల్లో చిక్కడం సంచలనంగా మారింది. ప్రస్తుతం గత కేసుతో కలిపి మొత్తం రూ.28.14 కోట్ల విలువైన ఆదాయానికి మించిన ఆస్తులను అధికారులు గుర్తించారు. వీటిలో అత్యధిక భాగం స్థిరాస్తుల రూపంలో ఉండగా, బహిరంగ మార్కెట్ ధరల ప్రకారం వాటి విలువ రూ.200 కోట్లకు పైగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ కేసులో ఆస్తుల కొనుగోలు, పెట్టుబడులు, బినామీ లావాదేవీల కోణంలో కూడా ఏసీబీ దర్యాప్తును మరింత విస్తరించింది.

# కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే

- **ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్‌కు భారత్ కౌంటర్**
- **సీమాంతర ఉగ్రవాదంపై ఐరాస వేదికగా నిలదీత**
- **ఐరాస భద్రతా మండలిలో పాకిస్థాన్‌కు చురకలు**
- **ఉగ్రవాదాన్ని విదేశాంగ విధానంగా వాడుకుంటోందని విమర్శ**
- **జమ్మూకశ్మీర్ భారత్‌లో విడదీయరాని భాగం**
- **పీఓకే ఖాళీ చేయడమే ఏకైక సమస్య అని స్పష్టత**
- **సింధూ జలాల ఒప్పందంపై భారత్ స్థిరమైన వైఖరి**
- **ఉగ్రవాదం, సహకారం ఒకేసారి సాధ్యం కాదన్న పర్వతనేని**

**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**

ఐక్యరాజ్యసమితి అత్యున్నత వేదికగా దాయాది దేశం పాకిస్థాన్‌కు భారతదేశం మరోసారి గట్టి చురకలంటించింది. సీమాంతర ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ తన విదేశాంగ విధానంలో ఒక అధికారిక సాధనంగా ఉపయోగిస్తోందని భారత్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉన్నత స్థాయి బహిరంగ చర్చలో ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ పాల్గొని మాట్లాడారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశంతో పరస్పర విశ్వాసం, సద్భావన ప్రాతిపదికన ఎలాంటి సంబంధాలు లేదా సహకారాన్ని ఆశించలేమని ఆయన స్పష్టం చేశారు.

జమ్మూకశ్మీర్ ఎప్పటికీ భారతదేశంలో అంతర్భాగమేనని, దానిని భారత్ నుంచి ఎవరూ విడదీయలేరని పర్వతనేని హరీశ్ స్పష్టం చేశారు. ఇది రాజ్యాంగపరంగా, అంతర్జాతీయ చట్టపరంగా మారని సత్యమని పునరుద్ఘాటించారు. జమ్మూకశ్మీర్ అంశంలో ప్రస్తుతం చర్చించాల్సిన లేదా పరిష్కరించాల్సిన ఏకైక సమస్య పాకిస్థాన్ అక్రమంగా ఆక్రమించుకున్న "పాక్ ఆక్రమిత కశ్మీర్ " ప్రాంతమేనని తేల్చిచెప్పారు. ఈ ప్రధాన వాస్తవాన్ని పాకిస్థాన్ ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తూ అంతర్జాతీయ సమాజం దృష్టిని మళ్లించడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు.

సింధూ జలాల ఒప్పందానికి సంబంధించి భారతదేశ వైఖరి అత్యంత స్పష్టంగా, స్థిరంగా ఉందని భారత ప్రతినిధి ప్రకటించారు. ఒకవైపు సీమాంతర ఉగ్రవాదాన్ని నిరంతరం ప్రోత్సహిస్తూ, మరోవైపు ద్వైపాక్షిక ఒప్పందాల ద్వారా ప్రయోజనాలు పొందాలని చూస్తే కుదరదని స్పష్టం చేశారు. రెండు దేశాల మధ్య ఎలాంటి సహకారమైనా పరస్పర విశ్వాసం, మంచి సంకల్పం ఉన్నప్పుడు మాత్రమే సాధ్యమవుతుందని, ఉగ్రవాద చర్యలు కొనసాగుతున్నంత కాలం ఇది సాధ్యపడదని పాకిస్థాన్‌కు సూటిగా తేల్చిచెప్పారు.

దీనికి ముందు ఐరాసలో పాకిస్థాన్ శాశ్వత ప్రతినిధి అసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ ప్రసంగిస్తూ భారత్‌పై నిరాధారమైన ఆరోపణలకు దిగారు. సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం ద్వారా భారతదేశం నీటిని ఒక ఆయుధంగా వాడుకుంటోందని విమర్శించారు. భారత్ తీసుకున్న ఈ నిర్ణయం చట్టవిరుద్ధమని, దీనివల్ల తమ దేశంలోని 24 కోట్లకు పైగా పౌరుల జీవనోపాధి తీవ్ర ముప్పులో పడిందని అంతర్జాతీయ సమాజం ముందు విన్నవించుకునే ప్రయత్నం చేశారు.

పాక్ ప్రతినిధి వ్యాఖ్యలపై పర్వతనేని హరీశ్ తీవ్రంగా ప్రతిస్పందిస్తూ, అంతర్జాతీయ వేదికలపై భారతదేశం వైపు వేళ్లు చూపిస్తూ నిరాధారమైన ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. ఇతరులపై బురద జల్లే ముందు పాకిస్థాన్ తన సొంత దేశంలో ఆవహించిన ఆర్థిక, సామాజిక, రాజకీయ సంక్షోభాలను, తీవ్రవాద సమస్యలను పరిష్కరించుకోవడంపై దృష్టి సారించాలని హితవు పలికారు. అంతర్జాతీయ వేదికలను దుర్వినియోగం చేయడం పాకిస్థాన్‌కు అలవాటుగా మారిందని దుయ్యబట్టారు.

చర్చా సందర్భంలో సహజ వనరుల వినియోగంపై మాట్లాడిన పర్వతనేని హరీశ్, సహజ వనరులను సక్రమంగా నిర్వహించుకోవాల్సిన ప్రాథమిక బాధ్యత సార్వభౌమత్వ దేశాలదేనని పేర్కొన్నారు. కొన్ని ప్రతికూల పరిస్థితుల్లో ఇటువంటి సహజ వనరుల అక్రమ దోపిడీ, అక్రమ రవాణా వంటివి సాయుధ ఉగ్రవాద గ్రూపులకు నిధులు సమకూర్చడానికి ఉపయోగింపబడి ప్రాంతీయ సంఘర్షణలకు దారితీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వనరులు ఎల్లప్పుడూ దేశాల అభివృద్ధికే సాధనాలుగా ఉండాలని అభిప్రాయపడ్డారు.

భారత్‌పాకిస్థాన్ మధ్య సింధూ జలాల ఒప్పందం 1960 సెప్టెంబర్‌లో కుదిరింది. ప్రపంచ బ్యాంక్ మధ్యవర్తిత్వంతో అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, పాక్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్‌లు ఈ చారిత్రాత్మక ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం సింధూ నదీ పరివాహక ప్రాంతంలోని ఆరు ప్రధాన నదులను విభజించారు. తూర్పు నదులైన రవి, బియాస్, సట్లెజ్ జలాల పూర్తి వినియోగ హక్కులు భారత్‌కు దక్కగా, పశ్చిమ నదులైన సింధూ, జీలమ్, చీనాబ్ నదుల నీటి హక్కులను పాకిస్థాన్‌కు కేటాయించారు.

అయితే, గతేడాది ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో ఉగ్రవాదులు జరిపిన దారుణ దాడితో ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ దాడి వెనుక పాకిస్థాన్ మద్దతు ఉన్న ఉగ్రవాద సంస్థల హస్తం ఉందని ఆధారాలతో సహా నిరూపితం కావడంతో భారత ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్‌పై పలు రకాల ఆంక్షలు విధించడంతో పాటు, ఏకపక్షంగా సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఉగ్రవాదాన్ని పెంచి పోషించే దేశంతో ఎలాంటి ఒప్పందాలూ కొనసాగబోవని, తమకు జాతీయ భద్రతే అత్యంత ముఖ్యమని భారత్ ఐరాస వేదికగా మరోసారి స్పష్టం చేసింది.

# వర్షభావ స్థితుల్లో రైతుల జీవితాలను దిస్మార్ట్ స్కూల్ ఆధ్వర్యంలో పాట రూపాకల్పన

- **పాఠశాల కరస్పాండెంట్ హన్నాన్ జావీద్ బృందాన్ని అభినందించిన ఏంఈఓ జకీర్ హుసేన్**

**జహిరాబాద్ జూలై 23 (ప్రజాక్షేత్రం):**

నియోజకవర్గంలోని కోహీర్ మున్సిపాలిటీ పరిధిలో గల ది స్మార్ట్ స్కూల్, కోహీర్ ఆధ్వర్యంలో వర్షాభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల జీవితాలను హృదయాన్ని హత్తుకునే విధంగా ప్రతిబింబిస్తూ విద్యార్థులు రూపొందించిన ప్రత్యేక గీతాన్ని ఘనంగా విడుదల చేశారు. పాఠశాల కరెస్పాండెంట్ హన్నాన్ జావిద్ మరియు ప్రిన్సిపాల్ బి. ప్రకాష్ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ పాటను ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) జాకీర్ హుస్సేన్ తమ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ వర్షాభావంతో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను విద్యార్థులు కళ్లకు కట్టినట్లుగా ఎంతో భావోద్వేగంగా ఆవిష్కరించారని ప్రశంసించారు. విద్యార్థులు ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాల్లోనే కాకుండా విద్యా రంగంలో కూడా ముందంజలో నిలిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల కరస్పండెంట్ హన్నన్ జావీద్ రైతుల నిజ జీవితంలో ఎదుర్కొనే వాస్తమైన పరిస్థితుల్లో కళ్ళకు కట్టిన విధంగా చూపడం అభినందనీయం అని ఏంఈఓ ప్రశంసించారు.కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు సురేందర్,ది స్మార్ట్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# యుద్ధానికి 95 బిలియన్ డాలర్ల బడ్జెట్

- **అమెరికా ప్రతినిధుల సభ ఆమోదం**
- **ట్రంప్ నిర్ణయంపై రాజకీయ దుమారం**
- **ఇరాన్ యుద్ధానికి భారీగా నిధులు**
- **స్వల్ప మెజారిటీతో గట్టెక్కిన బిల్లు**
- **-సొంత పార్టీలోనే వ్యక్తమైన భిన్నాభిప్రాయాలు**
- **యుద్ధం కాదు.. ప్రజా సంక్షేమమే ముఖ్యం**
- **ట్రంప్ వైఖరిపై విరుచుకుపడ్డ డెమొక్రాట్లు**

**అమెరికా, (ప్రజాక్షేత్రం):**

మధ్యప్రాచ్యంలో ఇరాన్‌తో కొనసాగుతున్న పోరాటానికి భారీగా నిధులు సమకూర్చేందుకు అమెరికా ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) కీలక ఆమోదం తెలిపింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సర్కార్ అత్యంత ప్రాధాన్యంగా తీసుకొచ్చిన $95 బిలియన్ల (రూ. 8 లక్షల కోట్లకు పైగా) భారీ అత్యవసర బడ్జెట్ బిల్లుకు బుధవారం సభ పచ్చజెండా ఊపింది. జాతీయ భద్రత, పెంటగాన్ అత్యవసర అవసరాలతో పాటు, ట్రంప్ ప్రభుత్వ సుంక విధానాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి, ఎన్నికల సంస్కరణలను అమలు చేయడానికి ఈ భారీ మొత్తాన్ని కేటాయించారు. మధ్యంతర ఎన్నికలకు ముందు ట్రంప్ ప్రభుత్వం సాధించిన ప్రధాన ఆర్థిక విజయాంకగా దీన్ని భావిస్తున్నారు.

ప్రతినిధుల సభలో అత్యంత ఉత్కంఠభరితంగా జరిగిన ఓటింగ్‌లో ఈ బిల్లు అతి స్వల్ప మెజారిటీతో ఆమోదం పొందింది. బిల్లుకు అనుకూలంగా 216 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 214 ఓట్లు పడ్డాయి. డెమొక్రాటిక్ పార్టీ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఈ బిల్లును వ్యతిరేకించగా, రిపబ్లికన్ పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు కూడా అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. ప్రభుత్వ సాధారణ వ్యయాల్లో ఎలాంటి కోతలు విధించకుండా కేవలం రక్షణ రంగానికే భారీగా నిధులు పెంచడంపై వారు అభ్యంతరం తెలిపారు. అయితే హౌస్ స్పీకర్ మైక్ జాన్సన్ చొరవ తీసుకుని, బడ్జెట్ సయోధ్య ప్రక్రియ ద్వారా బిల్లును నెగ్గించారు.

ట్రంప్ ప్రభుత్వం యుద్ధం పేరుతో ప్రజల సొమ్మును వృథా చేస్తోందని ప్రతిపక్ష డెమొక్రాట్లు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో పెరిగిపోతున్న జీవన వ్యయాన్ని తగ్గించడానికి, ఆరోగ్యం, విద్య, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఈ నిధులను వెచ్చించాలని డిమాండ్ చేశారు. హౌస్ డెమొక్రటిక్ కాకస్ ఛైర్మన్ పీట్ అగ్యిలార్ మాట్లాడుతూ, "ఇరాన్‌తో ఎలాంటి స్పష్టమైన ప్రణాళిక లేకుండా చేస్తున్న విఫల యుద్ధం కోసం బిలియన్ల డాలర్లు తగలేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఎలాంటి అధికారిక అనుమతి లేకుండానే ట్రంప్ ఈ సైనిక దాడులను కొనసాగిస్తున్నారు" అని ఆరోపించారు. ఇటీవల నిర్వహించిన సర్వేల్లోనూ అత్యధిక శాతం మంది అమెరికన్లు ఈ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తేలిందని పేర్కొన్నారు.

ఈ $95 బిలియన్ల బడ్జెట్ ప్రతిపాదనల్లో రక్షణ మంత్రిత్వ శాఖ (పెంటగాన్) అవసరాలకు ఏకంగా 60 బిలియన్ డాలర్లను కేటాయించారు. ఇతర జాతీయ భద్రతా కార్యక్రమాలకు 13 బిలియన్ డాలర్లు ఇచ్చారు. ఇదికాకుండా, ట్రంప్ ప్రభుత్వం విధించిన అంతర్జాతీయ వాణిజ్య సుంకాల కారణంగా ఆర్థికంగా నష్టపోయిన అమెరికా రైతులకు ఊరటనిచ్చేందుకు 12 బిలియన్ డాలర్ల ఆర్థిక ప్యాకేజీని ప్రతిపాదించారు. అంతేకాకుండా, పౌరసత్వ ధ్రువీకరణ మరియు ఓటింగ్ చట్టాల్లో భారీ మార్పులు తీసుకురావడానికి రూపొందించిన 'సేవ్ అమెరికా యాక్ట్' అమలు కోసం మరో 10 బిలియన్ డాలర్ల నిధులను పొందుపరిచారు.

బడ్జెట్‌లో భాగమైన 'సేవ్ అమెరికా యాక్ట్' అమెరికా రాజకీయాల్లో సరికొత్త రచ్చకు దారితీసింది. ఫెడరల్ ఎన్నికల్లో ఓటు వేయాలంటే అమెరికా పౌరసత్వ ధ్రువీకరణ పత్రాలు చూపించడం తప్పనిసరి చేయడమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశం. ట్రంప్ దీనికి గట్టిగా మద్దతు ఇస్తుండగా, దీనివల్ల సాధారణ పౌరులకు ఓటు హక్కు దూరమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఓటు హక్కు ఉన్న పౌరుల్లో దాదాపు 9 శాతం మందికి పౌరసత్వ ఆధార పత్రాలు సులభంగా అందుబాటులో లేవని, దాదాపు సగం మంది వద్ద యూఎస్ పాస్‌పోర్ట్ కూడా లేదని గణాంకాలు చెబుతున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదన వివాదాస్పదమైంది.

ప్రతినిధుల సభలో ఈ బడ్జెట్ బిల్లు ఆమోదం పొందినప్పటికీ, ఎగువ సభ అయిన సెనేట్‌లో దీనికి గట్టి సవాలు ఎదురుకానుంది. సెనేట్ మెజారిటీ నాయకుడు జాన్ థూన్ ఇప్పటివరకు ఈ ప్రతిపాదనపై తమ స్పష్టమైన వైఖరిని వెల్లడించలేదు. సెనేట్‌లో ప్రతిపక్ష డెమొక్రాట్ల 'ఫిలిబస్టర్' (చర్చల పేరుతో బిల్లును అడ్డుకునే ప్రక్రియ)ను అధిగమించడానికి రిపబ్లికన్లు బడ్జెట్ సయోధ్య ప్రక్రియను ఆశ్రయించేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. సాధారణంగా ప్రతిపక్షాల మద్దతు లేకుండా కేవలం 51 ఓట్ల సాధారణ మెజారిటీతో బిల్లును ఆమోదింపజేసుకోవడానికి ఈ ప్రత్యేక ప్రక్రియ ఉపయోగపడుతుంది. వచ్చే మధ్యంతర ఎన్నికల వేళ ఈ బడ్జెట్ వివాదం అమెరికా రాజకీయాన్ని ఊపేస్తోంది. తమ కష్టార్జితమైన పన్నుల సొమ్మును విదేశాల్లో యుద్ధాలు చేయడానికి వెచ్చిస్తున్నారని పౌరుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందని డెమొక్రాట్లు ప్రచారం చేస్తున్నారు. రిపబ్లికన్ బడ్జెట్ కమిటీ ఛైర్మన్ జోడీ ఆరింగ్టన్ మాత్రం ఈ విమర్శలను తిప్పికొట్టారు. "అమెరికా భద్రతను కాపాడటానికి సైన్యానికి అవసరమైన ఆయుధాలు, తూటాలు, బాంబులు అందించడం ప్రభుత్వం యొక్క ప్రాథమిక బాధ్యత. బలం ద్వారా మాత్రమే శాంతి సాధ్యమవుతుంది" అని సమర్థించుకున్నారు.

మరోవైపు రక్షణ శాఖ వర్గాలు తమ కేటాయింపులను సమర్థించుకుంటున్నాయి. గత బడ్జెట్‌లో సైన్యానికి ఇప్పటికే 150 బిలియన్ డాలర్లు కేటాయించినప్పటికీ, ప్రస్తుతం అంతర్జాతీయంగా తలెత్తిన సైనిక ఉద్రిక్తతల వల్ల పెంటగాన్ తీవ్ర నగదు కొరతను ఎదుర్కొంటోందని రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఇటీవల సెనేట్ విచారణలో స్పష్టం చేశారు. ప్రస్తుత క్లిష్టమైన భౌగోళిక రాజకీయ వాతావరణంలో అమెరికా రక్షణ రంగాన్ని, సైనిక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడం అత్యంత కీలకమని, అందుకే ఈ బడ్జెట్ నిధులు అత్యవసరమని రక్షణ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

# కేంద్ర జలశక్తి మంత్రితో బీజేపీ ఎంపీల భేటీ

మొదటిపేజీ తరువాయి

అనుమతులపై సమగ్రంగా చర్చించారు. రాష్ట్రానికి సంబంధించిన జలవనరుల వివాదాలు, కేంద్ర ప్రభుత్వ సహకారంపై నేతలు మంత్రికి ప్రత్యేకంగా విజ్ఞప్తులు సమర్పించారు.

ఈ కీలక సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు తెలంగాణకు చెందిన పలువురు ప్రముఖ బీజేపీ ఎంపీలు పాల్గొన్నారు. ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కే.రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్, గోడెం నగేశ్, డీకే అరుణ మరియు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు తదితరులు ఈ బృందంలో ఉన్నారు. రాష్ట్రంలోని రైతుల ప్రయోజనాలను కాపాడటానికి, నీటిపారుదల ప్రాజెక్టుల సమస్యలను వేగంగా పరిష్కరించడానికి కేంద్ర జలశక్తి శాఖ చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా నేతలు కోరారు.

ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని బ్యారేజీలు, అందులోని లోపాలు మరియు నీటి నిల్వ అంశాల చుట్టూనే తీవ్రంగా భ్రమిస్తున్నాయి. ఒకవైపు ఎల్‌నినో పరిస్థితుల వల్ల నీటి కొరత తలెత్తే ముప్పు ఉండగా, మరోవైపు కాళేశ్వరం పిల్లర్ల కుంగుబాటు వ్యవహారం రచ్చకెక్కింది. ఇటువంటి క్లిష్ట సమయంలో తెలంగాణ బీజేపీ ఎంపీలు అంతా కలిసి కేంద్ర జలవనరుల శాఖ మంత్రితో ప్రత్యేకంగా భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సమావేశం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టడంతో పాటు కేంద్రం వైఖరిని స్పష్టం చేసే యత్నం జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భద్రతపై నేషనల్ డామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఈ బ్యారేజీల గేట్లను పూర్తిగా ఎత్తి ఉంచాలని ఎన్డీఎస్ఏ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, అందుకే ఎగువ నుంచి వచ్చే నీటిని నిల్వ ఉంచకుండా కిందకు వదిలేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. భద్రతా పరమైన ప్రమాదాలు ఉన్నందున కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి గోదావరి నీటిని ఎత్తిపోసే ప్రసక్తే లేదని ప్రభుత్వం తమ నిర్ణయాన్ని గట్టిగా సమర్థించుకుంటోంది. కాళేశ్వరం పంపులు నడిపించి నీటిని నింపాలని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇదివరకే ఘాటుగా స్పందించారు. ఒకవేళ కన్నెపల్లి పంపులను ప్రారంభించి నీటిని ఎత్తిపోయాలని భావిస్తే, బీజేపీ నేతలే స్వయంగా చొరవ తీసుకుని కేంద్ర పరిధిలోని ఎన్డీఎస్ఏ నుంచి అవసరమైన అన్ని రకాల సాంకేతిక అనుమతులు తీసుకురావాలని సవాల్ విసిరారు. అనుమతులు లేకుండా పంపులు నడిపి ప్రమాదాలు కొనితెచ్చుకోలేమని సీఎం వ్యాఖ్యానించిన నేపథ్యంలో బీజేపీ ఎంపీలు కేంద్ర మంత్రిని



కలవడం గమనార్హం.మరోవైపు, అంతర్రాష్ట్ర నదీ జలాల సమర్థ వినియోగంలో భాగంగా 'గోదావరి కావేరి' నదుల అనుసంధానం ప్రక్రియను వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా యత్నిస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణలోని సమ్మక్క సాగర్ (దేవాదుల) ప్రాజెక్టును కేంద్రంగా చేసుకుని నీటిని తరలించేలా కేంద్రం ఇప్పటికే సానుకూల సంకేతాలు ఇచ్చింది. దక్షిణాది రాష్ట్రాల నీటి అవసరాలను తీర్చే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి మంత్రితో జరిగిన సమావేశంలో కీలక చర్చ జరిగినట్లు సమాచారం.

రాష్ట్రాల మధ్య నదీ జలాల వివాదాలను పరిష్కరించి, అనుసంధాన ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఒక ప్రత్యేక సమావేశానికి రూపకల్పన చేస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మరియు కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులతో త్వరలోనే కేంద్ర మంత్రి ఒక ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఉమ్మడి భేటీ ద్వారా ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న నీటి పంపకాల సమస్యలను పరిష్కరించి, ప్రాజెక్టులకు వేగం పెంచాలని కేంద్రం భావిస్తోంది.ఇదివరకే తుంగభద్ర రిజర్వాయర్ నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఒకే వేదికపై కలిసి మాట్లాడారు. ఆ సానుకూల వాతావరణాన్ని కొనసాగిస్తూ, త్వరలో జరగబోయే ముగ్గురు ముఖ్యమంత్రుల భేటీలో గోదావరికావేరి అనుసంధానంతో పాటు రాయలసీమకు కీలకమైన బనకచర్ల హెడ్ రెగ్యులేటర్, తెలంగాణకు చెందిన పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం వంటి బహుళ ప్రయోజన ప్రాజెక్టులపై సమగ్రంగా చర్చించి ఒక అంగీకారానికి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# కార్పొరేట్ సంస్థలకు దీటుగా గురుకులాలు

మొదటిపేజీ తరువాయి

చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల బోధనా ప్రమాణాలు, వసతి గృహాలు, పారిశుధ్యం, భోజన వసతులు మరియు విద్యా వాతావరణాన్ని క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు.తనిఖీ అనంతరం కొత్తగా చేరిన విద్యార్థులకు 11 రకాల నిత్యావసర వస్తువులతో కూడిన 'వెల్‌కమ్ కిట్ల'ను మంత్రి పంపిణీ చేశారు. ఈ కిట్‌లో ప్లేటు, గ్లాసు, గిన్నె, కప్పు, స్పూను, బెడ్‌షీట్, టవల్, బ్లాంకెట్, షూస్, సాక్స్ మరియు స్కూల్ బ్యాగ్ ఉన్నాయి. అలాగే జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను మంత్రి ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదరికం అనేది ఏ ఒక్కరి ప్రతిభకు లేదా ఎదుగుదలకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలను ఉచితంగా అందిస్తోందని స్పష్టం చేశారు.

చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డైట్ ఛార్జీలను ప్రస్తుత ప్రభుత్వం గణనీయంగా పెంచిందని మంత్రి అడ్లూరి గుర్తుచేశారు. దీనివల్ల గురుకులాల్లో చదువుకునే విద్యార్థులకు రోజూ బలవర్ధకమైన, పౌష్టికాహారాన్ని అందించడం సాధ్యమవుతోందన్నారు. సరైన పోషకాహారం లభించడం వల్ల పిల్లల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఏకాగ్రత, చదువుపై శ్రద్ధ పెరుగుతాయని, ఇది వారి విద్యా నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఎంతగానో దోహదపడుతుందని వివరించారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు దేశంలోనే అత్యుత్తమ విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు. సంక్షేమ వసతి గృహాలను కేవలం నివాస కేంద్రాలుగా కాకుండా, ప్రతిభను వెలికితీసే విజ్ఞాన నిలయాలుగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

రాష్ట్రంలోని గురుకుల విద్యార్థులు కేవలం వార్షిక పరీక్షల్లోనే కాకుండా, నీట్, జేఈఈ , ఈఏమ్‌సెట్ వంటి ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో అద్భుతమైన ర్యాంకులు సాధిస్తున్నారని మంత్రి ప్రశంసించారు. ఆటలు, ఇతర సృజనాత్మక అంశాల్లో కూడా మన పిల్లలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పథకాలు సాధిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. సరూర్‌నగర్ విక్టోరియా మెమోరియల్ పాఠశాల విద్యార్థులు కూడా అదే స్ఫూర్తితో చదివి దేశానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.గురుకులాల్లో చదువుకునే పిల్లలకు నాణ్యమైన చదువు అందించేందుకు విద్యా మౌలిక సదుపాయాలను భారీగా ఆధునీకరిస్తున్నామని మంత్రి తెలిపారు. తరగతి గదులను డిజిటలైజ్ చేయడం, అత్యాధునిక సైన్స్ అండ్ కంప్యూటర్ ల్యాబ్‌లను అందుబాటులోకి తేవడం, గ్రంథాలయాలను విస్తరించడం మరియు నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించడం ద్వారా గురుకులాల రూపురేఖలు మారుస్తున్నామని వివరించారు.



గత ప్రభుత్వ హయాంలో గురుకులాలకు సంబంధించి నిలిచిపోయిన నిధులను, బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే విడుదల చేసిందని మంత్రి వెల్లడించారు. నిధుల విడుదల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిపోయిన మౌలిక వసతుల కల్పన పనులు, భవనాల మరమ్మతులు మరియు నూతన నిర్మాణ పనులు ప్రస్తుతం వేగవంతంగా సాగుతున్నాయని తెలిపారు. సంక్షేమ విద్యాసంస్థలకు నిధుల కొరత లేకుండా చూస్తున్నామని స్పష్టం చేశారు. కేవలం వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యం కాదని, ఉన్నత విద్య, పోటీ పరీక్షలు మరియు భవిష్యత్ నాయకత్వ పాత్రల్లో మన పిల్లలు విజయం సాధించేలా తీర్చిదిద్దడమే తమ అసలు లక్ష్యమని మంత్రి ఆకాంక్షించారు. ప్రతి గురుకుల విద్యార్థి తనలోని పూర్తి సామర్థ్యాన్ని గుర్తించి, దేశాభివృద్ధిలో భాగస్వామి అయ్యే వాతావరణాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి విజయేంద్ర బోయి, విక్టోరియా మెమోరియల్ సంస్థ కార్యదర్శి సల్మా బాను, ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, సూపర్వైజర్ లక్ష్మీ పార్వతి తదితర అధికారులు పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ కాంగ్రెస్ నేతల నిరసన

- **నీట్ పేపర్ లీకేజీ పై శంషాబాద్ పట్టణంలో నిరసన..**
- **కేంద్ర మంత్రుల రాజీనామా చేయాలి...**
- **శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిల్క మర్రి మహేందర్ ముదిరాజ్**

**శంషాబాద్ జులై23(ప్రజాక్షేత్రం):**

కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అణచివేసే విధంగా వ్యవహరిస్తూ, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్ర నేతలను అరెస్టు చేయడాన్ని, విద్యార్థులపై అమానుషంగా లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ గురువారం శంషాబాద్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలకమర్రి మహేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మండల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తల సమక్షంలో శంషాబాద్ లొ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన నీట్ పేపర్ లీక్ ఘటనపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం, వారికి మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలి. అన్నారు.

నీట్ పేపర్ లీక్ ఘటనపై స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలి. విద్యార్థులపై లాఠీచార్జ్‌కు ఆదేశించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు కోటేశ్వర్ గౌడ్,రవి, ఆంజనేయులు,గోపాల్ నాయక్,దేవేందర్ నాయక్, ప్రభాకర్ యాదవ్,ఇంద్రారెడ్డి, బొబ్బిలి ఉమామహేశ్వర్, నర్సింగ్ రావు, సురేందర్,సిద్దులు,సతీష్ యాదవ్,దయానంద్,మనోజ్ కుమార్,బన్నీ,ఇమ్రాన్,ప్రభాకర్ గౌడ్,ప్రవీణ్,రఫిక్,శ్రీశైలం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల మధ్య సబ్‌స్టేషన్ వద్దంటూ
# భావనాఋషి సొసైటీ నిరసన

- **సబ్‌స్టేషన్ నిర్మాణం నిలిపివేయాలని సొసైటీ డిమాండ్**



**కాప్రా, జూలై 23(ప్రజా క్షేత్రం):**

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలోని కాప్రా సర్కిల్ పరిధిలోని భావనాఋషి కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ స్థలంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టడంపై సొసైటీ ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సొసైటీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అధ్యక్షుడు సీత ఆంజనేయులు మాట్లాడుతూ అధికారుల తీరుపై మండిపడ్డారు.

సర్వే నంబర్ 158లోని 2.10 గుంటల భూమికి సంబంధించి 2001 నుంచి వివిధ కోర్టుల్లో వివాదం కొనసాగుతున్నప్పటికీ, 2009లో జీహెచ్‌ఎంసీ ఆమోదించిన లేఅవుట్ ప్రకారం ఆ స్థలం తమ సొసైటీ అధీనంలోనే ఉందని ఆయన తెలిపారు. ఈ భూమికి సంబంధించి హైకోర్టు నుంచి 2026 జనవరి 27న స్టేటస్‌కో ఉత్తర్వులు కూడా పొందినట్లు చెప్పారు.

అయితే, రెవెన్యూ అధికారులు కేటాయించిన భూమిగా పేర్కొంటూ విద్యుత్ శాఖ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభించిందని ఆరోపించారు. ఇళ్ల మధ్యలో, కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మించడం ప్రజల భద్రతకు ముప్పుగా మారుతుందని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణ, ఆస్తి నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. వెంటనే సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు నిలిపివేసి, ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎంపిక చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు అతినగరం సుదేష్, కార్యదర్శి పున్న రమేష్, కోశాధికారి అవ్వారు రామకృష్ణ, గుర్రం విశ్వేశ్వరరావు, కర్నాటి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం.. కాప్రాలో జెండా ఆవిష్కరణ

**కాప్రా, జూలై 23(ప్రజా క్షేత్రం):**

భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) 72వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఎంఈయూ (బీఎంఎస్) రిజిస్ట్రేషన్ నం.1157 ఆధ్వర్యంలో గురువారం కాప్రా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో కాప్రా హౌస్ స్టోర్స్ బీఎంఎస్ ప్రెసిడెంట్ రాజు కుమార్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే భారతీయ మజ్దూర్ సంఘ్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్మికులను సంఘటితం చేసి వారి సమస్యల పరిష్కారానికి సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. సంఘటిత శక్తితోనే కార్మిక సంక్షేమం సాధ్యమవుతుందని, ప్రతి కార్మికుడు సంఘం బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో విజయ నిర్మల (జనరల్ సెక్రటరీ), కవిత (వర్కింగ్ ప్రెసిడెంట్), చైన్ మ్యాన్లు రమేష్, హౌస్ స్టోర్స్ ఎంప్లాస్ రాజు, యాదగిరి, ఎల్లయ్య, ధర్మతేజతో పాటు బీఎంఎస్ నాయకులు, కార్మికులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సభ్యులు పరస్పరం ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.



# సాంకేతిక విజ్ఞానంతో విద్యార్థుల్లో అభ్యసన ఆసక్తిని పెంపొందించాలి

- **సమగ్ర సేవాకాల ఉపాధ్యాయ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి**
- **సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యేక అవగాహన**
- **తరగతి గదిలో వినూత్న బోధనా విధానాలపై దృష్టి**
- **విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపే ఉపాధ్యాయుల లక్ష్యం**
- **పెద్దేముల్ మండల ఎంఈఓ, కోర్స్ డైరెక్టర్ నర్సింగ్ రావు**

**పెద్దేముల్,జూలై 23 (ప్రజాక్షేత్రం):**

మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ వృత్తి నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యాబోధనలో సమర్థవంతంగా వినియోగించాలని పెద్దేముల్ మండల ఎంఈఓ,కోర్స్ డైరెక్టర్ నర్సింగ్ రావు సూచించారు.గురువారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న "సమగ్ర సేవాకాల ఉపాధ్యాయ శిక్షణ" 2వ స్పెల్ మొదటి రోజు ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ఉపాధ్యాయులను ఉద్దేశించి పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు.మొదటి రోజు నిర్వహించిన శిక్షణలో విద్యార్థుల అభ్యసన స్థాయిలు, (ఫౌండేషనల్ లిటరెసి అండ్ న్యూమరెసి) అమలు మార్గదర్శకాలు, రిమీడియేషన్, కమ్యూనికేటివ్ టీచింగ్, భాషా మరియు గణిత బోధనలో నూతన పద్ధతులపై సవివరంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పెద్దేముల్ మండల ఎంఈఓ,కోర్స్ డైరెక్టర్ నర్సింగ్ రావు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు.ప్రతి విద్యార్థిలో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు వారి ఆలోచనా శక్తి, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేసే విధంగా బోధన సాగాలని సూచించారు.అందుకోసం ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు కొత్త బోధనా విధానాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకుని తరగతి గదిలో వినియోగించాలన్నారు.మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ శిక్షణలో తరగతివారీ బోధనా ప్రణాళికలు, కనీస అభ్యసన సామర్థ్యాల సాధన, విద్యార్థుల అభ్యసన స్థాయిని పెంపొందించే పద్ధతులు, డిజిటల్ బోధన, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుని విద్యార్థులకు ఉత్తమమైన విద్యను అందించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు జీవితాంతం విద్యార్థులుగానే ఉంటూ కొత్త విషయాలను నేర్చుకోవాలని, బోధనలో వినూత్న పద్ధతులను అవలంబించాలని సూచించారు.



విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని, ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో సెంటర్ ఇంచార్జి అక్కమాదేవి ,పెద్దేముల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సునీత,ఎంఆర్పీలు గంజి బందెప్ప (గణితం ),రాఘవేందర్ (తెలుగు ),శోభన్ బాబు (ఇంగ్లీష్ ),నర్సిరెడ్డి (జనరల్ ), ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఢిల్లీలో జరిగిన ఘటనను ఖండిస్తూ బోధన్ బీజేపీ కార్యకర్తల ధర్నా

**బోధన్ జూలై 23(ప్రజాక్షేత్రం):**

బోధన్ లో బిజెపి నాయకులు ఢిల్లీలో జరిగిన అల్లర్ల సందర్భంగా దేశ ప్రధానమంత్రి మరియు ఆయన దివంగత తల్లిపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం, మహిళా మీడియా ప్రతినిధిపై జరిగిన దుర్వ్యవహారాన్ని తీవ్రంగా ఖండిస్తూ బోధన్ పట్టణంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు, కార్యకర్తలు గురువారం ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసే హక్కు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలు, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేయడం, మహిళా జర్నలిస్టుల పట్ల దురుసుగా ప్రవర్తించడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఇటువంటి ఘటనలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.

ధర్నాలో పాల్గొన్న కార్యకర్తలు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా మోర్చా నాయకులు, యువ మోర్చా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ధర్నా

**బోధన్ జూలై 23(ప్రజాక్షేత్రం):**

నిజాంబాద్ జిల్లా బోధన్ పట్టణంలో నీట్ పేపర్ లీకేజ్ పై ఢిల్లీలో రాహుల్ గాంధీని అరెస్టు నీ నిరసిస్తూ బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెట్ పేపర్ లీకేజీ అంశంపై దీనిలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న లోక్సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ కి ప్రియాంక గాంధీతో పలువురు కాంగ్రెస్ నేతలు పోలీసులు చేయటానికి నిరసిస్తూ పోలీస్ ఫారెస్ట్ చేయటానికి గురువారం బోధన్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారులు బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టినట్టు పార్టీ నాయకులు తెలిపారు కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యం హక్కులను అందిస్తుందని శాంతియుత నిరసనకు కూడా అవకాశం ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకుల అరెస్టు చేయడం ప్రజాస్వామానికి విరుద్ధమని వారు విమర్శించారు ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్ మాజీ కౌన్సిలర్ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు ఈ విజయవంతాన్ని విజయవంతంగా చేసిన ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకునికి ధన్యవాదాలు తెలియజేస్తూ కృతజ్ఞతలు చేశారు.



## ప్రజల సమస్యలే ఎజెండా..294వ డివిజన్‌లో కమిషనర్ పర్యటన

- **కమిషనర్ పర్యటనలో గ్రీన్ హిల్స్ సమస్యల ప్రతిధ్వని**
- **కాలనీ కష్టాలు కమిషనర్ ముందుకు..చర్యలకు సృజన హామీ**

**కుత్బుల్లాపూర్,జూలై 23 (ప్రజాక్షేత్రం):**

ప్రతిరోజు ఒక వార్డు' కార్యక్రమంలో భాగంగా సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన గురువారం 294వ డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. కాలనీల్లోని పారిశుధ్యం, మౌలిక వసతులు, అభివృద్ధి పనులను పరిశీలిస్తూ స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా గ్రీన్ హిల్స్ హౌసింగ్ కాలనీ అధ్యక్షుడు అమర్నాథ్, కాలనీలో చాలా కాలంగా కొనసాగుతున్న రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల వివరాలను పొందుపరిచిన వినతిపత్రాన్ని ఆమెకు అందజేసి తక్షణ పరిష్కారం కల్పించాలని కోరారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన కమిషనర్ సృజన సమస్యలను శ్రద్ధగా విన్నారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసి రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అధికారుల సానుకూల స్పందనతో కాలనీవాసులు సమస్యల పరిష్కారంపై ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలను ప్రజల నుంచే నేరుగా తెలుసుకుని పరిష్కార దిశగా చర్యలు ప్రారంభించడం ' ప్రతిరోజు ఒక వార్డు' కార్యక్రమం లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. స్థానికులు కూడా ఇలాంటి పర్యటనలు తరచూ నిర్వహించి పెండింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.






## విధులకు డుమ్మా..వైద్యాధికారిపై డీఎంహెచ్‌వో ఆగ్రహం

- **జవహర్‌నగర్ పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ.. వివరణ ఇవ్వాలని ఆదేశం**

**కీసర, జూలై 23(ప్రజా క్షేత్రం):**

కీసర సర్కిల్ పరిధిలోని జవహర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డా. కె. ఆనంద్ గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డా. విజయ్ చంద్ర గత కొన్ని రోజులుగా విధులకు క్రమం తప్పకుండా హాజరు కాకపోవడంతో పాటు రోగులకు అందించాల్సిన సేవల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు గుర్తించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయానికి హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

తనిఖీలో భాగంగా క్షయవ్యాధి (టీబీ) మొబైల్ ఎక్స్‌రే యూనిట్ పనితీరును పరిశీలించి, ప్రజలకు సేవలు సక్రమంగా అందుతున్నాయా అనే అంశాన్ని సమీక్షించారు. ఫార్మసీలో ఈఔషధి పోర్టల్‌లో నమోదైన మందుల నిల్వలు, పంపిణీ వివరాలను మాన్యువల్ స్టాక్ రిజిస్టర్లతో సరిపోల్చి పరిశీలించారు. గడువు ముగియనున్న మందుల కోసం ప్రత్యేకంగా 'నియర్ ఎక్స్‌పైరీ డ్రగ్ కార్నర్' ఏర్పాటు చేసి, వాటి నిర్వహణలో నిర్లక్ష్యం ఉండొద్దని ఆదేశించారు.

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి గౌరవంగా, నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని డీఎంహెచ్‌వో స్పష్టం చేశారు. విధి సమయాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత యూనిఫామ్‌లో విధులకు హాజరుకావాలని, ఆసుపత్రి పరిశుభ్రత, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వేములకొండ పీహెచ్‌సీకి ప్రహరీ గోడ పునర్నిర్మించాలి

- **సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి**

**వలిగొండ జిల్లా 23(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వేములకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూలిపోయిన ప్రహరీ గోడ స్థానంలో వెంటనే నూతన ప్రహరీ గోడను నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, సుమారు 10 గ్రామాలకు సేవలందిస్తున్న ఈ ఆసుపత్రికి ప్రతి రోజూ వందలాది మంది రోగులు వస్తున్నారని తెలిపారు. ఆసుపత్రి ప్రహరీ గోడ అనేక చోట్ల కూలిపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఏర్పడిందని, దీనివల్ల సిబ్బంది, రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వెంటనే ప్రహరీ గోడను పునర్నిర్మించాలని కోరారు. ఇద్దరు మెడికల్ ఆఫీసర్లలో ఒకరిని వెలువర్తి పీహెచ్‌సీకి డిప్యూటేషన్‌పై పంపారని, అదనపు మెడికల్ ఆఫీసర్‌ను నియమించాలని, ఖాళీగా ఉన్న రెండు అటెండర్ పోస్టులు భర్తీ చేయడంతో పాటు స్వీపర్ పోస్టును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు ఆసుపత్రి ప్రాంగణంలో కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, వాటి నివారణకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అడిచర్లపల్లి ధర్మచారి ,కర్ణకంటి మల్లేశం, శ్రీకాంత్,సత్తయ్య,నరసింహతో పాటు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# ఉద్యోగం నుంచి తొలగించారంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని నిరసన

- **టెక్ మహీంద్రా ఎదుట మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ధర్నా**
- **ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి..ఇదే ప్రధాన కారణమా?**

**కుత్బుల్లాపూర్,జూలై 23 (ప్రజాక్షేత్రం):**





దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బహదూర్‌పల్లిలో ఉన్న టెక్ మహీంద్రా కార్యాలయం ఎదుట గురువారం ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చేపట్టిన ధర్నా స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కుటుంబ అత్యవసర పరిస్థితుల్లో సెలవు కోరినందుకే తనను ఉద్యోగం నుంచి తొలగించారని ఆరోపిస్తూ బాధితురాలు భావన సంస్థ యాజమాన్యంపై తీవ్ర విమర్శలు చేశారు. తనకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని విరమించబోనని స్పష్టం చేశారు.

బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. తన కుమార్తె అనారోగ్యంతో బాధపడుతుండటంతో మూడు రోజుల సెలవు అవసరమని ముందుగానే యాజమాన్యానికి సమాచారం ఇచ్చి అనుమతి కోరినట్లు పేర్కొన్నారు. అయితే సెలవు కోరిన కొద్దిరోజులకే తనను ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు ఈమెయిల్ ద్వారా సమాచారం అందిందని ఆరోపించారు. ఎలాంటి విచారణ లేకుండా, తన వాదన వినకుండానే ఈ నిర్ణయం తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**'ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి'**

సంస్థలో ఉద్యోగులపై అధిక పనిభారం, అనవసర ఒత్తిడి కొనసాగుతోందని భావన ఆరోపించారు. వాష్‌రూమ్‌కు వెళ్లాలన్నా అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉందని, అనారోగ్యంతో ఉన్నప్పటికీ విధులకు హాజరు కావాలని ఈమెయిల్ ద్వారా ఒత్తిడి తెచ్చారని తెలిపారు. సిక్ లీవ్‌కు వేతనం చెల్లించకపోయినా కార్యాలయానికి రావాలని సూచించారని పేర్కొన్నారు.

**పోలీసులకు ఫిర్యాదు..న్యాయం కోసం ధర్నా**

ఈ ఘటనపై ఇప్పటికే దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు భావన వెల్లడించారు. అయినప్పటికీ తనకు న్యాయం జరగకపోవడంతో టెక్ మహీంద్రా కార్యాలయం ఎదుట ధర్నాకు దిగినట్లు తెలిపారు. యాజమాన్యం తనపై తీసుకున్న ఉద్యోగ తొలగింపు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకుని, తనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ ఘటనతో కొంతసేపు కార్యాలయం ఎదుట ధర్నాకు దిగడంతో టెక్ మహీంద్రా యాజమాన్యం నుండి అధికారులు వచ్చి సంప్రదింపులకు తీసుకెళ్లడం జరిగింది.ప్రస్తుతం ఇవి బాధితురాలు చేసిన ఆరోపణలు మాత్రమే కాగా, సంస్థ స్పందన అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి.

- **బి ఎల్ ఏ లు కీలక పాత్ర పోషిస్తున్నారు.**
- **బి ఎల్ ఏ లకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి దిశా నిర్దేశం.**

**యాలాల జూలై 23 (ప్రజాక్షేత్రం):**

యాలాల మండలంలోని చెన్నారం సమీపం అనిల్ గార్డెన్ లో గురువారం మండలానికి చెందిన బి ఎల్ ఎ తో సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహిపాల్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఎస్ ఐ ఆర్ పై బి ఎల్ ఎ లకు పార్టీ శ్రేణులకు సూచనలు చేశారు.బి ఎల్ ఎ లు కీలకపాత్ర పోషిస్తున్నారు, మిగతా పది రోజులు కూడా మీ పాత్ర కీలకంగా ఉండాలి అన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమని,ప్రతి అర్హులైన ఓటరు పేరు ఓడరు జాబితాలో ఉండేలా బిఎల్ఎ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎవరు తమ ఓటు హక్కును కోల్పోకుండా ఇంటింటికి వెళ్లి ఓటరు వివరాలను పరిశీలించి, అవసరమైన దరఖాస్తులను సకాలంలో సమర్పించాలని కోరారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు,చిరునామా మార్పులు,ఇతర సవరనలను పారదర్శకంగా పూర్తి చేయాలి అన్నారు. ప్రతి బూత్ లో కాంగ్రెస్ పార్టీ బలాన్ని మరింత పెంచేందుకు బి ఎల్ ఏ లు ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలి పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు జాబితా స్వచ్ఛతకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ప్రతి బి ఎల్ ఎ బాధ్యతాయుతంగా పనిచేసే నియోజకవర్గం లో వంద శాతం ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీలో భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి ఎస్ ఐ ఆర్ పర్యవేక్షకులు కోటం వినయ్ రెడ్డి,జగదీశ్వరావు,కాంగ్రెస్ పార్టీ ఎస్ఐఆర్ నియోజకవర్గ కన్వీనర్ పురుషోత్తం రావు, మండల పార్టీ అధ్యక్షుడు కుర్వ మహిపాల్ యాదవ్,రాజ వర్ధన్ రెడ్డి,బి బ్లాక్ అధ్యక్షులు అనిల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నర్సిరెడ్డి, నాయకులు హన్మంతు, ఉప సర్పంచ్ ల మండల సంఘం అధ్యక్షులు ఉప్పరి వెంకటయ్య, మండల పార్టీ మాజీ ఉపాధ్యక్షులు భీమయ్య, ప్రజా ప్రతినిధులు ,సీనియర్ నాయకులు,బిఎల్ఎ లు,వివిధ గ్రామాల సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# డిసిసిబి చైర్మన్ గా పోచారం భాస్కర్ రెడ్డి ఎన్నో సేవలు చేశారు

- **ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రైతులకు ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉన్నారు**
- **బాన్సువాడ నియోజకవర్గ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలి**
- **పోతంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల శంకర్**
- **పోతంగల్ లో ఘనంగా పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు**

**కోటగిరి,జులై 23( ప్రజాక్షేత్రం):**

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల మాజీ డీసీసీబీ పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు పోతంగల్ మండల కేంద్రం లో గురువారం కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. పోతంగల్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణ లో కటౌట్లను ఏర్పాటు చేసి, కేకులు కట్ చేసి, టపాకాయలు కాలుస్తూ పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయనకు మండల నాయకులు ప్రజల తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుప్పాల శంకర్, సీనియర్ నాయకుడు ఎజాస్ ఖాన్ మాట్లాడుతూ... పోచారం శీనన్న తనయుడుగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డిసిసిబి చైర్మన్ గా పనిచేసి జిల్లా రైతులకు ప్రజలకు ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు.పోచారం భాస్కర్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉంటూ, తండ్రి మార్గంలో నడుస్తూ కార్యకర్తలకు ప్రజలకు, ఆపదలో ఉన్నవారికి ఎల్లవేళలా, అందుబాటులో ఉంటున్న వ్యక్తి భాస్కర్ రెడ్డి అని అన్నారు. ఇలాంటి జన్మదిన వేడుకలు ఇంకా మరెన్నో జరుపుకోవాలని ఆ భగవంతున్ని మనస్ఫూర్తిగా వేడుకున్నారు. కార్యక్రమంలో పోతంగల్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు షాజీ పటేల్, కోటగిరి మాజీ జెడ్పిటిసి శంకర్ పటేల్, మాజీ ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హమీద్, నీరెడి గంగాధర్, మండల సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు వివేక్, పోతంగల్ ఉప సర్పంచ్ గులాం నబి, మాజీ ఎంపీటీసీ కేశ వీరేశం, మాజీ మండల కో ఆప్షన్ మెంబర్ ఇస్మాయిల్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకురే గంగాధర్,యూత్ కాంగ్రెస్ నాయకులు పుప్పాల అభిషేక్,గంధపు రాజు,సూదం ధన్ రాజ్,గంధపు దత్తు, మన్సూర్,ఆయా గ్రామాల సర్పంచులు,ఉమ్మడి మండలాల,కార్యకర్తలు నాయకులు ప్రజలు, పోచారం భాస్కర్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.





## సాంప్రదాయాల పరిరక్షణకు స్వామి వివేకానంద పాఠశాల కృషి

- **ఆషాఢ మాసం సందర్భంగా స్వామి వివేకానంద పాఠశాలలో గోరింటాకు వేడుక**
- **సాంప్రదాయాలకు ప్రాధాన్యం.. విద్యార్థినులకు గోరింటాకు విశిష్టతపై అవగాహన**
- **భారతీయ సంస్కృతి,ఆరోగ్య పరిరక్షణలో గోరింటాకు ప్రత్యేకత**
- **స్వామి వివేకానంద పాఠశాల.... ప్రిన్సిపాల్ పి.జయంతి**

**పెద్దేముల్,జూలై 23 (ప్రజాక్షేత్రం):**

ఆషాఢ మాసం సందర్భంగా స్వామి వివేకానంద పాఠశాలలో గురువారం సాంప్రదాయబద్ధంగా గోరింటాకు వేడుకను నిర్వహించారు.భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణతో పాటు విద్యార్థినులకు గోరింటాకు యొక్క ఆరోగ్య ప్రయోజనాలను తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా స్వామి వివేకానంద పాఠశాల ప్రిన్సిపాల్ పి.జయంతి మాట్లాడుతూ.... ఆషాఢ మాసంలో ఆడపిల్లలు గోరింటాకు పెట్టుకోవడం అనాదిగా వస్తున్న భారతీయ సాంప్రదాయమని తెలిపారు.వర్షాకాలంలో వాతావరణ మార్పుల కారణంగా శరీరంలో ఉష్ణోగ్రత పెరిగే అవకాశం ఉంటుందని,గోరింటాకు సహజసిద్ధమైన చల్లదనాన్ని అందించి శరీరానికి ఉపశమనం కలిగిస్తుందని వివరించారు.అలాగే గోరింటాకు చర్మానికి మేలు చేయడమే కాకుండా సూక్ష్మక్రిములు, కీటకాల ప్రభావం నుంచి రక్షణ కల్పించడంలో కూడా ఉపయోగపడుతుందని చెప్పారు.సాంప్రదాయాల వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలను విద్యార్థులు తెలుసుకుని వాటిని ఆచరించాలని సూచించారు.స్వామి వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ...విద్యార్థులకు విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, విలువలపై అవగాహన కల్పించడం కూడా విద్యాసంస్థల బాధ్యతేనని అన్నారు.ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సంస్కృతి పట్ల గౌరవాన్ని, సాంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాధ, నిర్మల,కల్పన,అప్సాన,సునీత, వెంకటలక్ష్మి,అంజలి,హరి సుధన్ రెడ్డి,నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి

- **మొయినాబాద్ చౌరస్తా వద్ద హోరెత్తిన కాంగ్రెస్ నిరసన**
- **రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గం: పార్టీ నాయకులు**

**మొయినాబాద్,జులై 23(ప్రజాక్షేత్రం):**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మొయినాబాద్ చౌరస్తా వద్ద భారీ ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల వైపు నిలబడి పోరాడుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అక్రమంగా అదుపులోకి తీసుకోవడం మోదీ ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని మండిపడ్డారు.

కేంద్ర ప్రభుత్వానికి, బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పెద్దెత్తున నినాదాలు చేస్తూ పరిసర ప్రాంతాలను హోరెత్తించారు. మోదీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు స్వస్తి చెప్పకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు,అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.





# అమరుల యాదిలో గీతన్నల బస్సు యాత్రను జయప్రదం చేయండి.

- **కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య గాజుల ఆంజనేయులు**

**వలిగొండ జులై 23(ప్రజాక్షేత్రం):**

అమరవీరుల యాది లో జరుగు గీతన్నల బస్సు యాత్రను జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, గాజుల ఆంజనేయులు

పిలుపునిచ్చారు గురువారం రోజున వలిగొండ మండల కేంద్రంలో మార్కెట్ యార్డులో బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా

వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చారిత్రాత్మకమైన బస్సు యాత్రను జయప్రదం చేయండి రాష్ట్రంలో ఒక కోటి తాటి ఈత వృక్ష సంపదను ప్రకృతి మనకు ప్రసాదించింది వీటిపై గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు గీత కార్మికుల ఉపాధిని మెరుగుపరచాలని అన్నారు వృత్తిలో జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో మనకు ఇచ్చిన హామీలు పెన్షన్ 4000 రూపాయలు చెట్ల పెంపకానికి 5 ఎకరాల భూమి

ప్రతి సొసైటీకి ఇవ్వాలని కోరారు . రాష్ట్ర బడ్జెట్లో కేటాయించిన రూపాయలు 25 కోట్లు సంక్షేమానికి కేటాయించిన 67 కోట్లు వెంటనే విడుదల చేయాలని అన్నారు నందనంలోని నీరా సెంటర్ను ప్రారంభించాలని ప్రతి జిల్లాలో తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని అన్నారు అదేవిధంగా ఆగస్టు 18 సర్వే పాపన్న జయంతి రోజు ట్యాంక్ బండ్ పై విగ్రహం ప్రతిష్టాలని అన్నారు ఆగస్టు 9వ తేదీన వలిగొండ మండలానికి వచ్చే బస్సు యాత్రను జయప్రదం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పబ్బతి మల్లేశం,కార్యదర్శి పలుసం స్వామి,రేకల లక్ష్మీనారాయణ,లింగరాజు పల్లి సర్పంచ్ లింగస్వామి కొండూరు అంజయ్య పబ్బు స్వామి. ధనంజయ శ్రీకాంత్ మారయ్య గోపాల్,మల్లేశం,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సందర్శనలో ప్రజలతో సిఎంసి కమిషనర్ ముఖాముఖి

- **బహదూర్‌పల్లిలో ప్రజా సమస్యలపై కమిషనర్ ఫోకస్**
- **ఇంటి చెత్త సేకరణకు కొత్త ఈవీ వాహనాలు..సేవల మెరుగుదలకు సీఎంసీ అడుగులు**

**కుత్బుల్లాపూర్,జూలై 23 (ప్రజాక్షేత్రం):**

పట్టణ పాలనలో క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కాలపరిమితి విధించే దిశగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) అడుగులు వేస్తోంది. "ఒక వార్డు-ఒక రోజు" కార్యక్రమంలో భాగంగా కమిషనర్ డాక్టర్ జి. సృజన, ఐఏఎస్ గురువారం దుండిగల్ సర్కిల్ 59 పరిధిలోని బహదూర్‌పల్లి (వార్డు294)లో విస్తృతంగా పర్యటించి, ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.

స్థానిక నివాసితులు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల (ఆర్‌డబ్ల్యూఏ) ప్రతినిధులు డ్రైనేజీ, తాగునీటి సరఫరా, అంతర్గత రహదారులు, వీధిదీపాలు, పారిశుద్ధ్యం తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల వినతులను అక్కడికక్కడే పరిశీలించిన కమిషనర్, సంబంధిత శాఖల అధికారులకు ఆలస్యం లేకుండా పరిష్కార చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఇంటింటికీ చెత్త సేకరణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు 450 నుంచి 500 గృహాలకు సేవలందించే సామర్థ్యం కలిగిన కొత్త ఎలక్ట్రిక్ చెత్త సేకరణ వాహనాలను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు కమిషనర్ ప్రకటించారు. చెత్త సేకరణలో జాప్యానికి అవకాశం లేకుండా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు.

అదేవిధంగా, ప్రతి సమస్య పరిష్కారానికి నిర్దిష్ట గడువు నిర్ణయించాలని, పనుల పురోగతిని ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందన మాత్రమే కాకుండా, ఫలితాలు కనిపించేలా పనిచేయాలని సూచించారు.

ఈ పర్యటనలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్,ఐఏఎస్,దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్, గ్రంథాలయ చైర్మన్ బి. శ్రీనివాస రెడ్డి,మాజీ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు,మైసిగారి శ్రీనివాస్, డిప్యూటీ ఇంజనీర్లు అన్వేష్ రెడ్డి, పాపమ్మ, అసిస్టెంట్ ఇంజనీర్లు సురేందర్ నాయక్,అశోక్ కుమార్,ఏసీపీ శ్రీనివాస్,ఏఎంసీ లక్ష్మయ్యతో పాటు వివిధ విభాగాల అధికారులు,సిబ్బంది, వివిధ కాలనీలా ప్రజలు పాల్గొన్నారు.



# సైబర్ మోసాలపై అప్రమత్తతే ఆయుధం

- **ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి**
- **డీజీపీ సీవీ ఆనంద్**
- **సైబర్ కేసులపై రాష్ట్రవ్యాప్తంగా సమీక్ష**
- **జిల్లాల వారీగా వివరాలు పరిశీలన**

**వనపర్తి,జూలై 23 (ప్రజాక్షేత్రం):**

రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు సాంకేతికతతో పాటు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం అత్యంత కీలకమని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. సైబర్ మోసాలపై ప్రతి పోలీసు అధికారి అప్రమత్తంగా ఉండాలని, బాధితులకు వేగంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
గురువారం డీజీపీ కార్యాలయం నుంచి రాష్ట్రంలోని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, క్షేత్రస్థాయి అధికారులతో నిర్వహించిన దృశ్య సమీక్ష సమావేశంలో ఆయన సైబర్ నేరాల పరిస్థితిని సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్రంలో ఎక్కువగా జరుగుతున్న సైబర్ నేరాలు, వాటి నియంత్రణకు చేపడుతున్న చర్యలపై అధికారులతో చర్చించారు.

**కొత్త తరహా మోసాలపై అప్రమత్తం**

పెట్టుబడుల పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్ట్, ట్రేడింగ్ యాప్‌లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో మోసాలు, ఆన్‌లైన్ లోన్ యాప్‌లు, నకిలీ వెబ్‌సైట్లు, క్యూఆర్ కోడ్‌లు, ఓటీపీలు, యూపీఐ, క్రెడిట్ కార్డు మోసాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని డీజీపీ ఆదేశించారు. అనుమానాస్పద లింకులు, యాప్‌లు, పెట్టుబడి ఆఫర్లు, డిజిటల్ అరెస్ట్ పేరుతో వచ్చే కాల్స్‌ను నమ్మవద్దని సూచించారు.

**1930కు వెంటనే ఫిర్యాదు చేయాలి**

సైబర్ మోసానికి గురైన వెంటనే బాధితులు 1930 హెల్ప్‌లైన్ లేదా జాతీయ సైబర్ నేరాల నివేదిక పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని డీజీపీ సూచించారు. వెంటనే స్పందిస్తే మోసపోయిన నగదును ట్రాక్ చేసి సంబంధిత బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసే అవకాశం ఉంటుందని తెలిపారు. దర్యాప్తు పూర్తైన తర్వాత



చట్టపరమైన ప్రక్రియలను వేగవంతం చేసి కోర్టు అనుమతితో బాధితులకు నగదు తిరిగి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి**

ప్రతి సైబర్ కేసును అత్యంత ప్రాధాన్యంతో దర్యాప్తు చేసి నిందితుల బ్యాంకు ఖాతాలు, మొబైల్ నంబర్లు, డిజిటల్ లావాదేవీలు, ఐపీ అడ్రస్‌లు తదితర సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించాలని డీజీపీ సూచించారు. పెండింగ్ కేసులను నిరంతరం సమీక్షిస్తూ బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని తెలిపారు.

**వనపర్తి జిల్లా వివరాలు సమర్పించిన ఎస్పీ**

సమావేశంలో వనపర్తి జిల్లా ఎస్పీ సునితారెడ్డి జిల్లాలో నమోదైన సైబర్ నేరాల వివరాలను డీజీపీకి వివరించారు.డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ నాయక్,సైబర్ క్రైమ్ సీఐ శ్రీను నాయక్,ఎస్సై రవిప్రకాశ్,స్పెషల్ బ్రాంచ్ అధికారులు,డీసీఆర్‌బీ సిబ్బంది,ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అధికారులు కార్యాలయాలను విడిచిపెట్టి క్షేత్రస్థాయిలో పర్యటించాలి శ్రీరాములు అందెల

- **ఏ.జి.ఆర్ కాలనీలో పర్యటించిన శ్రీరాములు అందెల**

**మహేశ్వరం జూలై.23 (ప్రజాక్షేత్రం):**

మహేశ్వరం నియోజకవర్గం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బడంగ్ పేట్ సర్కిల్ లో గల బడంగ్ పేట్ డివిజన్ లో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు, బడంగ్ పేట్ మాజీ సర్పంచ్ నడికుడ యాదగిరి ఆధ్వర్యంలో ఏ.జి.ఆర్ కాలనీవాసులు ఎదుర్కొంటున్నటువంటి ప్రధాన రహదారి సమస్య మరియు డ్రైనేజ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టిన నేపథ్యంలో మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ అందెల శ్రీరాములు హాజరై ఏ.జి.ఆర్ కాలనీలో పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు అధికారులకు ఎన్నిసార్లు సమస్యలను పరిష్కరించాలని మొరపెట్టుకున్న స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ శ్రీరాములు కి వివరించారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏ.జి.ఆర్ కాలనీలో ప్రధాన రహదారి, డ్రైనేజీ సమస్యలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజలు ఎన్నిసార్లు వినతిపత్రాలు అందించినా సమస్యల పరిష్కారంలో ఎలాంటి పురోగతి కనిపించకపోవడం బాధాకరమని అన్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే రహదారి నిర్మాణ పనులు చేపట్టడంతో పాటు సమగ్ర డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం కొనసాగిస్తే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం మల్లారెడ్డి, బిజెపి అధ్యక్షులు రామిడి వీరకర్ణ రెడ్డి,బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు ఏనుగు రామిరెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు రేసు నరసింహారెడ్డి,పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,నవారు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొంతం మురళీధర్ రెడ్డి,యువ మూర్చ రాష్ట్ర నాయకులు శూరకర్ణ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు లాల సందీప్, ఉపాధ్యక్షులు విజేందర్,బిజెపి నాయకులు కుంటి భాస్కర్, అంకంగారి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు సైదులు, కార్యదర్శి ప్రవీణ్ గౌడ్,బంగారు సురేష్,మల్లేష్,లక్ష్మీనారాయణ యాదవ్,బీజేవైఎం నాయకులు బంగారు రాహుల్,బంగారు రాజ్ కుమార్,పవన్ కుమార్,భరత్ ముదిరాజ్,శివ ముదిరాజ్,బంగారు సాహిల్, మనోహర్,గిరి,రాజ్ కుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు

- **కొడిచెర్ల నుండి కల్లూరు వైపు నడుస్తున్న ఇసుక ట్రాక్టర్లతో కల్లూరు గ్రామస్తులకు తిప్పలు**
- **అక్రమ ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుని పోలీసులకు అప్పజెప్పిన కల్లూరు గ్రామస్తులు**

**కోటగిరి,జులై 23(ప్రజాక్షేత్రం):**

ఎలాంటి అనుమతులు లేకుండా రాత్రి, పగలు, తేడా లేకుండా కొడిచెర్ల మంజీరా పరివాహక ప్రాంతం నుంచి అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోతంగల్ మండలం కల్లూర్ గ్రామంలో గురువారం ఉదయం గ్రామ ప్రజలు, అడ్డుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం రాత్రంతా నిరంతరంగా నడుపుతున్నది సరిపోదన్నట్లు పర్మిషన్ల పేరుతో ఉదయం 6 గంటల నుండే అక్రమ ఇసుక రవాణా చేస్తున్నరని 9 గంటల తర్వాత పర్మిషన్ ఇస్తున్నప్పటికీ అంతకు ముందే ఒక్కో ట్రాక్టర్ తో రెండు ట్రిప్పుల అక్రమ ఇసుక తరలిస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఉదయం 6 గంటలకు ఇసుక రవాణా చేస్తుండడం వల్ల పొలాలకు వెళ్లే రైతులకు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. పరిమిషన్లు లేకుండా ఉదయం సాయంత్రం అక్రమ ఇసుక రవాణా చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొడిచర్ల గ్రామం నుండి ఇసుక కల్లూరు మీదుగా తరలిస్తుండడంతో గ్రామంలో రోడ్లు పాడవుతున్నాయని, బ్రిడ్జిలు కూలిపోతున్నాయని వాపోతున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా విచ్చలవిడిగా అక్రమ ఇసుక రవాణా చేస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తుంది. ఇప్పటికైనా తమ గ్రామం నుండి కొనసాగుతున్న అక్రమ ఇసుక రవాణాను నిలిపివేయాలని కల్లూరు గ్రామస్తులు కోరుతున్నారు. పర్మిషన్లు ఉన్నప్పుడు ఇసుక నడిపిస్తే తమకేమీ అభ్యంతరం లేదని గ్రామంలో నడిచే వాహనాలు కొంచెం నెమ్మదిగా వెళ్లేలా అధికారులు ప్రమేయం చూపాలని కోరారు. కోట్ల రూపాయలతో వేసిన రోడ్లు పాడవుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు.

**గ్రామస్తులు అడ్డుకునేంతవరకు స్పందించని అధికారులు..?**

ప్రభుత్వ అనుమతులు ఉన్న ప్రతిరోజు కొడిచెర్ల గ్రామం నుండి నడిచే ఇసుక ట్రాక్టర్లకు ఉదయం 9 తర్వాత అధికారులు వే బిల్లులు జారీ చేస్తారు. కానీ ట్రాక్టర్ యజమానులు అంతకుముందే దురాశతో వే బిల్లులు లేకున్నా





ఒకటి రెండు ట్రిప్పులు ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం. రాత్రుల్లో ఇసుక నడిచే విషయం పక్కన పెడితే ఉదయం నుంచి ఇలా విచ్చలవిడిగా అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవటం అనుమానాలకు తావిస్తుంది. ఈ తంతు చాలా రోజులుగా కొనసాగుతుందని అయినా అధికారులు మాత్రం ఇప్పటివరకు ట్రాక్టర్లు పట్టుకున్న దాఖలాలు లేకపోవడం గమనార్హం. చివరికి ఇబ్బందులు భరించలేక తమ అవస్థలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కల్లూరు గ్రామస్తులే రోడ్డుపైకి వచ్చి అక్రమంగా నడుస్తున్న ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించి పోలీసులకు అప్పజెప్పారు. గ్రామస్తులు అడ్డుకునేంతవరకు అధికారులు అక్రమ ఇసుక రవాణాను పట్టించుకోకపోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అనుమతులు ఉన్న సమయంలో తప్ప ఇతర సమయాల్లో ఇసుక నడిస్తే అధికారులు చర్యలు చేపట్టాలని కల్లూరు గ్రామస్తులు కోరుతున్నారు. ఇకపై తమ గ్రామం నుండి అక్రమ ఇసుక నడిపిస్తే సహించేది లేదని గ్రామస్తులు ట్రాక్టర్ యజమానులను హెచ్చరించారు.



## కేఎల్ఆర్ ను కలిసిన నూతన పార్టీ అధ్యక్షులు

- **(ఎస్ఆర్ఐ) లో కాంగ్రెస్ ఓట్లు గల్లంతు కాకుండా చూడాలి.**
- **క్షేత్రస్థాయిలో పని చేసిన వారికే పదవులు: కిచ్చెన్న**

**మహేశ్వరం జూలై 23 (ప్రజాక్షేత్రం):**

పేద,మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం పని చేసే పార్టీ కేవలం కాంగ్రెస్సేనని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.
ఇవాళ తుక్కుగూడ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల, డివిజన్ అధ్యక్షులు మర్యాదపూర్వకంగా... కేఎల్ఆర్. ను కలిశారు. ఈ సందర్భంగా వారందరినీ సన్మానించిన లక్ష్మారెడ్డి విబేధాలు వీడి అందరినీ కలుపుకుని పోవాలని సూచించారు. ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణ కార్యక్రమం వందశాతం పూర్తి అయ్యేలా (బి ఎల్ ఎ) (బిఎల్ఓ) లను సమన్వయం చేసుకోవాలని నూతన అధ్యక్షులకు కిచ్చెన్న సూచనలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గారి ఆలోచన మేరకు వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాలనీలు, డివిజన్లల్లోని ఓటర్లు, ముఖ్య నాయకులను కలుసుకుని... ప్రభుత్వ పథకాలు, సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు చేపట్టాలని డివిజన్ అధ్యక్షులకు.కేఎల్ఆర్. విజ్ఞప్తి చేశారు. vఆగస్టు 3వరకు ఎన్నికల సంగ్రామం తరహాలోనే (ఎస్ఆర్ఐ) ను పూర్తి చేయాలని (బి ఎల్ ఎ) కాంగ్రెస్ శ్రేణులను లక్ష్మారెడ్డి కోరారు.
ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కాంగ్రెస్ నాయకులు,మహిళా నాయకురాళ్లు,బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్ పై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

- **ఎన్ టి ఏ ను రద్దు చేయాలి అని డిమాండ్**

**మహేశ్వరం జూలై 23(ప్రజాక్షేత్రం):**

ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర శాంతియుత నిరసన చేస్తున్న విద్యార్థి యువకులపై జరిగిన దాడిపై పారదర్శకంగా విచారణ జరపాలి. పోలీసులు అమానుష లాఠీ చార్జ్, టియర్ గ్యాస్, దాడిని ఖండిస్తూ గ్రేటర్ హైదరాబాద్ నగర కార్యదర్శి కొల్లూర్ భీమేష్ మాట్లాడుతూ రేపు జూలై 24న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ వామపక్ష విద్యార్థి సంఘాల బంద్ కు యువజన సంఘాల సంపూర్ణ మద్దతు ఇస్తూ ప్రకటించింది.




## విద్యార్థుల భవిష్యత్తు పై దాడి చేయాలని చూస్తే ఖబర్దార్ మోడీ

- **- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బేషరత్తుగా రాజీనామా చేయాలి.**
- **విద్యార్థి నాయకుడు పెరుమాండ్ల సురేష్ డిమాండ్ చేశారు**



**తలకొండపల్లి, జులై 23 (ప్రజాక్షేత్రం):**

నీట్ పేపర్ లీక్‌పై కేంద్రం జవాబుదారీతనం వహించాలి విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండించిన విద్యార్థి నాయకుడు పెరుమాండ్ల సురేష్ విద్యార్థుల హక్కులు, పరీక్షల పారదర్శకత కోసం కాంగ్రెస్ పోరాటానికి మద్దతివ్వాలినీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలని, తమ హక్కుల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన పోలీసుల దౌర్జన్యానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు న్యూఢిల్లీలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ చేపట్టిన ధర్నాకు ఆయన సంపూర్ణ సంఘీభావం తెలిపారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశ యువతలో తీవ్ర ఆందోళన కలిగించిందని అన్నారు. న్యాయం కోసం గళం విప్పిన విద్యార్థులపై బలప్రయోగం చేయడం, వారిని భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పెరుమాండ్ల సురేష్ పేర్కొన్నారు. విద్యార్థుల గొంతును అణచివేయడం కాకుండా వారి ఆవేదనను ప్రభుత్వం వినాలని సూచించారు. దేశ యువతకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల పక్షాన నిలబడుతుందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షల పారదర్శకత, జవాబుదారీతనం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేపట్టిన పోరాటానికి కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాస్వామ్యవాదులు, దేశ ప్రజలు అండగా నిలవాలని యువజన కాంగ్రెస్ విద్యార్థి నాయకుడు పెరుమాండ్ల సురేష్ పిలుపునిచ్చారు.

## తండ్రి బాటలో నియోజకవర్గ అభివృద్ధికి భాస్కర్ రెడ్డి కృషి చేయాలి

- **భగవంతుడి దీవెనలతో ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని**
- **కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షాహిద్ హుస్సేన్**
- **కోటగిరిలో మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు**

**కోటగిరి,జులై 23( ప్రజాక్షేత్రం ):**

తండ్రి బాటలో నడిచే బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధికి పోచారం భాస్కర్ రెడ్డి కృషి చేయాలని కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షాహిద్ హుస్సేన్ ఆకాంక్షించారు.ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన సందర్భంగా కోటిగిరి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల అభిమానుల ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు పెట్టి బాణసంచాలు పేలుస్తూ ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి ఒక్కరినొకరు తినిపించుకుంటూ భాస్కర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల మైనార్టీ యువ నాయకులు జుబేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షాహిద్, హంగర్గ ఫారం గ్రామ మాజీ సర్పంచ్ ఎజాజ్ ఖాన్ మీడియాతో మాట్లాడుతూ... తండ్రి బాటలో నడుస్తూ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని భవిష్యత్తులో నియోజకవర్గ అభివృద్ధి కోసం భాస్కర్ రెడ్డి మరింత పనిచేయాలని కోరారు. నిరంతరం ప్రజల కష్టాల్లో అండగా నిలుస్తు నియోజకవర్గ ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారని వారు పేర్కొన్నారు. అన్నా అంటే నేనున్నానంటూ ప్రతి ఒక్కరికి ధైర్యం చెప్పి ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ ప్రజల మన్ననలను పొందుతున్నారని ఇలాంటి మంచి మనసున్న భాస్కర్ రెడ్డికి ఆ భగవంతుడు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు ప్రసాదించి రాజకీయంలో అంచెలంచెలుగా ఎదిగి ప్రజలకు మరింత సేవ చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి శంకర్ పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ గాయక్వాడ్ హనుమంతు, పోతంగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూప్పల శంకర్, ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు కూచి సిద్దు, కొత్తపల్లి ప్రథమిక సహకార సంఘం అధ్యక్షులు డాక్టర్ సునీల్ కుమార్ చౌదరి,కోటగిరి మండల మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు పత్తి లక్ష్మణ్,మాజీ ఏఎంసీ చైర్మన్ హమీద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనిల్ కులకర్ణి,ఆయా గ్రామాల సర్పంచులు మాజీ ఎంపిటిసిలు, పిబీఆర్ యువసేన సభ్యులు, పోచారం భాస్కర్ రెడ్డి అభిమానులు పాల్గొన్నారు.



# రోడ్డు విస్తరణ నోటీసుల కలకలం.. నిరుపేద మహిళా మృతి

- **నివాసం కోల్పోతామనే ఆందోళనతో కుప్పకూలిన మహిళ..**
- **సుందరగిరిలో విషాదం**



**చిగురుమామిడి,జూలై 23 (ప్రజాక్షేత్రం):**

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో ఇల్లు కోల్పోతామనే ఆందోళనతో ఓ నిరుపేద మహిళ గుండెపోటుతో మృతిచెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి క్రాస్ రోడ్డు నుంచి హుస్నాబాద్ వరకు చేపట్టనున్న నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అధికారులు మొదటి విడతలో హుస్నాబాద్ నుంచి సుందరగిరి వరకు రోడ్డు మధ్యభాగం నుంచి ఇరువైపులా 40 అడుగుల మేర మార్కింగ్ చేసి, ప్రభావిత ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు.

ఈ క్రమంలో సుందరగిరి గ్రామానికి చెందిన బుర్ర మధురవ్వ (55), భర్త రాజయ్య నివాసం రోడ్డు విస్తరణ పరిధిలోకి రావడంతో ఆమె తీవ్ర మనోవేదనకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న మధురవ్వ, నోటీసులు అందుకున్నప్పటి నుంచి ఇల్లు కోల్పోతామనే భయంతో ఆందోళన చెందుతున్నట్లు పేర్కొన్నారు.

గురువారం మధ్యాహ్నం కూరగాయలు విక్రయించి ఇంటికి చేరుకున్న అనంతరం మధురవ్వకు ఒక్కసారిగా తీవ్ర గుండెనొప్పి రావడంతో కుప్పకూలిపోయింది. కుటుంబ సభ్యులు గమనించేలోపే ఆమె మృతిచెందినట్లు తెలిపారు. వైద్యులు గుండెపోటుతో మరణించినట్లు నిర్ధారించినట్లు సమాచారం. అయితే, రోడ్డు విస్తరణ నోటీసుల కారణంగా ఏర్పడిన మానసిక ఆందోళనతోనే మధురవ్వ మృతిచెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారుల నుంచి అధికారిక నిర్ధారణ వెలువడాల్సి ఉంది.

**బాధిత కుటుంబానికి పరిహారం ఇవ్వాలని డిమాండ్**

మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకుని ఆర్థిక సాయం, తగిన పరిహారం అందించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. అలాగే రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న పేద కుటుంబాలకు ముందస్తు పునరావాసం కల్పించి, వారి జీవన భద్రతకు హామీ ఇవ్వాలని కోరారు.



# వనపర్తిలో ధర్నా..రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

- **కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ విమర్శలు**

**వనపర్తి,జూలై 23 (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నరపరాజు రామచంద్రరావును అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ వనపర్తి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో ధర్నా నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ మాట్లాడుతూ, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్యలకు పాల్పడుతుండగా, తెలంగాణలో నిరసన తెలిపిన బీజేపీ నాయకులను అరెస్టు చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పిరికిపంద చర్య అని ఆరోపించారు. పోలీసు నిర్బంధాలు, అక్రమ అరెస్టులతో బీజేపీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టలేరని, కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ధర్నాలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్. లోకనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. శ్రీశైలం, కేతూరి బుడ్డన్న, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హనుమాన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు శ్రీనివాస్ గౌడ్, వారణాసి కల్పన, జిల్లా కోశాధికారి బండారు కుమారస్వామి, ఉపాధ్యక్షులు కొత్తకాపు శివారెడ్డి, గోర్ల బాబురావు, పలువురు జిల్లా, మండల నాయకులు, మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల నిరసనల అణచివేత ప్రజాస్వామ్య విరుద్ధం

- **నీట్ ఉద్యమాలపై కేంద్ర తీరును ఖండించిన నిరంజన్ రెడ్డి..**
- **హైదరాబాద్ ఆందోళనకు భారీగా తరలిరావాలని పిలుపు**



**వనపర్తి,జూలై 23 (ప్రజాక్షేత్రం):**

నీట్ పేపర్ లీకేజీ అంశంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం అణచివేత ధోరణి అవలంబిస్తోందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. గురువారం వనపర్తిలో బీఆర్ఎస్ విద్యార్థి, యువజన విభాగాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, విధానాల కారణంగా దేశవ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థులు నష్టపోయారని ఆరోపించారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కును ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిందని, ఆ హక్కును హరిస్తూ విద్యార్థుల గొంతు నొక్కే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని నిరంజన్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ అణచివేత విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి వనపర్తి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు, యువత తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, విద్యార్థి కోఆర్డినేటర్ హేమంత్ ముదిరాజ్, యువజన విభాగం అధ్యక్షుడు సూర్యవంశం గిరి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జోహెబ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుల పర్తికి మళ్లీ పూర్వవైభవం

- **30 నెలల్లో రూ.334 కోట్లతో విద్యారంగానికి భారీ ఊతం**
- **వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో విద్యా మౌలిక సదుపాయాల విస్తరణ**
- **పాఠశాలల నుంచి ఉన్నత విద్య వరకు అభివృద్ధి పనులు.**
- **భావితరాలపై దీర్ఘకాలిక పెట్టుబడి**






**వనపర్తి,జులై 23(ప్రజాక్షేత్రం):**

ఒకప్పుడు "చదువుల పర్తి"గా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన వనపర్తి, మళ్లీ తన విద్యా వైభవాన్ని అందుకునే దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. గతంలో విద్యా రంగంలో తగిన మౌలిక సదుపాయాల కొరతతో వెనుకబడిన ఈ ప్రాంతంలో, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో విద్యారంగానికి పెద్దపీట వేయడంతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి.

గత 30 నెలల్లో వనపర్తి నియోజకవర్గంలో సుమారు రూ.2,147 కోట్ల అభివృద్ధి పనులు కొనసాగుతుండగా, అందులో రూ.334 కోట్లను విద్యారంగానికే కేటాయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు విద్యా మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా భావితరాలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యం స్పష్టమవుతోంది.

**చారిత్రాత్మక బాలుర ఉన్నత పాఠశాలకు రూ.47 కోట్లతో సరికొత్త రూపు**

వనపర్తి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల జిల్లాలోనే కాకుండా రాష్ట్ర విద్యా చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఈ పాఠశాలలో చదివిన అనేక మంది విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత స్థానాలు అధిరోహించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కూడా ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేయడం ఈ విద్యాసంస్థ ప్రత్యేకతను చాటుతోంది.

ఈ చారిత్రాత్మక పాఠశాలను ప్రస్తుతం రూ.47 కోట్లతో అత్యాధునిక ప్రమాణాల ప్రకారం అభివృద్ధి చేస్తున్నారు. డిజిటల్ తరగతి గదులు, ఆధునిక సైన్స్, కంప్యూటర్ ప్రయోగశాలలు, విశాలమైన గ్రంథాలయం, క్రీడా మైదానాలు, ఇతర ఆధునిక సౌకర్యాలతో రాష్ట్రంలోనే ఆదర్శ ప్రభుత్వ పాఠశాలగా తీర్చిదిద్దే పనులు వేగంగా సాగుతున్నాయి.

**రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు**

విద్యా రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణానికి రూ.200 కోట్లతో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఒకే ప్రాంగణంలో విద్య, వసతి, భోజనం, గ్రంథాలయం, ప్రయోగశాలలు, డిజిటల్ క్లాస్‌రూములు, క్రీడా సదుపాయాలు, వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కూడా నగర స్థాయి విద్యను పొందే అవకాశం కలుగుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారనుంది.

**క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం.. స్పోర్ట్స్ స్కూల్‌కు తొలి విడతగా రూ.15 కోట్లు**

విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం కల్పించే లక్ష్యంతో స్పోర్ట్స్ స్కూల్ నిర్మాణానికి తొలి విడతగా రూ.15 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ విద్యాసంస్థ అందుబాటులోకి వస్తే చదువుతో పాటు క్రీడల్లోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు విద్యార్థులకు లభిస్తాయని అధికారులు భావిస్తున్నారు.

**జేఎన్‌టీయూ, పీజీ కళాశాలలకు కొత్త భవనాలు**

ఉన్నత విద్యను బలోపేతం చేసే దిశగా రూ.5 కోట్లతో జేఎన్‌టీయూ కళాశాల, రూ.3 కోట్లతో పీజీ కళాశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఆధునిక వసతులతో ఈ విద్యాసంస్థలు విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించనున్నాయి.

**పాలిటెక్నిక్‌కు ఆధునిక హంగులు**

సాంకేతిక విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ పాలిటెక్నిక్ కళాశాలలో రూ.13 కోట్లతో వసతి గృహాలు, రూ.10 కోట్లతో ప్రధాన భవనం పునరుద్ధరణ పనులు చేపట్టారు. దీంతో సాంకేతిక విద్యను అభ్యసించే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

**అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల.. పట్టణ విద్యార్థులకు వరం**

పట్టణ ప్రాంత విద్యార్థుల కోసం దాదాపు రూ.4 కోట్లతో అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం ప్రారంభమైంది. నివాస సౌకర్యాలతో కూడిన ఈ విద్యాసంస్థ నాణ్యమైన విద్యకు మరో వేదికగా నిలవనుంది.

**కేంద్రీయ విద్యాలయం తో అడుగులు**

వనపర్తిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు, ఈ విద్యా సంవత్సరం నుండి తరగతులు ప్రారంభమయ్యాయి. నూతన భవనం అందుబాటులోకి వస్తే సీబీఎస్ఈ విధానంలో విద్య స్థానిక విద్యార్థులకు అందడంతో పాటు జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు మరింత అనుకూల వాతావరణం ఏర్పడనుంది.

**ప్రభుత్వ పాఠశాలల్లో సమగ్ర అభివృద్ధి**

పెద్ద ప్రాజెక్టులతో పాటు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ వ్యవస్థ, మరమ్మతు పనులు చేపడుతున్నారు. దీంతో ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

**తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు కూడా మార్గం సుగమం**

తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ, పరిపాలన అనుమతులు కూడా లభించాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే జిల్లాలో ప్రభుత్వ విద్యకు మరో నాణ్యమైన విద్యాసంస్థ అందుబాటులోకి రానుంది.

**భవిష్యత్తు తరాల కోసం భారీ పెట్టుబడి**

విద్యారంగంలో జరుగుతున్న ఈ అభివృద్ధి కేవలం భవనాల నిర్మాణానికే పరిమితం కాకుండా, గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, పోటీ ప్రపంచానికి సిద్ధం చేసే విద్యా వాతావరణాన్ని కల్పించడం వంటి దీర్ఘకాలిక లక్ష్యాలకు బాటలు వేస్తోంది.

మొత్తంగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హయాంలో గత 30 నెలల్లో విద్యారంగానికి రూ.334 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు జిల్లాలో కొత్త విద్యా అధ్యాయానికి నాంది పలుకుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకప్పుడు "చదువుల పర్తి"గా పేరొందిన వనపర్తి, మళ్లీ అదే గుర్తింపును మరింత బలోపేతం చేసుకుంటూ రాష్ట్రంలోనే ఆదర్శ విద్యా కేంద్రంగా ఎదిగే దిశగా ముందుకు సాగుతోందని విద్యావేత్తలు,విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# "ఘనంగా బిఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం..

- **జెండాను ఎగరవేసిన ఆటో టాక్సీ రాష్ట్ర అధ్యక్షులు చింతల నందకిషోర్**

**శంషాబాద్ జులై23(ప్రజాక్షేత్రం):**

శంషాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని బిఎంఎస్ 72వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం శంషాబాద్ పట్టణంలో ఆటో యూనియన్ నాయకులు ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆటో టాక్సీ రాష్ట్ర అధ్యక్షులు చింతల నందకిషోర్ బిఎంఎస్ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బిఎంఎస్ యూనియన్ కార్మికుల కోసం పనిచేస్తుందన్నారు. కార్మికుడే కార్మిక నాయకుడిగా పని చేయాలని అన్ని పార్టీలకు అతీతంగా బిఎంఎస్ పనిచేస్తుందని ఏ పార్టీకి సంబంధించినది కాదన్నారు. కార్మికుల కోసం పనిచేసే ఏకైక జాతీయ కార్మిక సంస్థ అన్నారు .ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎండి సైదులు,కుమ్మరి రాజు, గౌస్,రాజు గౌడ్,శివ,రాజు, అశోక్,శంకర్,రంజిత్,లడ్డు, కృష్ణ,ఫయాజ్, రాజు,లింగం, రమేష్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే వేధింపులే భర్త ప్రాణాలు తీశాయి: సమత

- **మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ధర్నా... న్యాయం కోసం కుటుంబ సభ్యుల ఆందోళన**

**కరీంనగర్, జూలై 23 (ప్రజాక్షేత్రం) :**

మానకొండూర్ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే వేధింపులు, అక్రమ కేసుల కారణంగానే తన భర్త రాజేందర్ రెడ్డి ఆత్మహత్యకు పాల్పడి, చికిత్స పొందుతూ మృతి చెందారని గుండ్లపల్లి మాజీ సర్పంచ్ బేతెల్లి సమత ఆరోపించారు. కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద విలేకరులతో మాట్లాడిన ఆమె, నిరంతర మానసిక వేధింపులను తట్టుకోలేకే ఈ విషాదం జరిగిందని పేర్కొన్నారు. తన భర్తపై అక్రమ కేసులు నమోదు చేసి తీవ్ర ఒత్తిడికి గురిచేశారని, భర్తను కోల్పోవడంతో తాము, తమ పిల్లలు అనాథలుగా మారిపోయామని సమత ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాజేందర్ రెడ్డి మృతదేహంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. ఎమ్మెల్యే పీఏ వేధింపుల వల్లే ఈ ఘటన జరిగిందని ఆరోపిస్తూ, బాధ్యులపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. "న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తీసుకెళ్లం" అంటూ కుటుంబ సభ్యులు స్పష్టం చేయడంతో ఆస్పత్రి వద్ద కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

గమనిక: ఈ కథనంలో పేర్కొన్న ఆరోపణలు బాధిత కుటుంబ సభ్యులు చేసినవి. సంబంధిత వ్యక్తుల స్పందన, అధికారిక దర్యాప్తు వివరాలు వెలువడాల్సి ఉంది.





# తపస్ మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

- **ఆగస్టు 1న హైదరాబాద్ మహాధర్నాను విజయవంతం చేయాలి**
- **విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యం**
- **తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల బస్వరాజ్**

**పెద్దేముల్, జూలై 23(ప్రజాక్షేత్రం):**

విద్యారంగం, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల బస్వరాజ్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు.గురువారం తాండూరు పట్టణంలోని తపస్ కార్యాలయంలో మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గాజుల బస్వరాజ్ మాట్లాడుతూ...విద్యారంగానికి సంబంధించిన అనేక సమస్యలు చాలా కాలంగా అపరిష్కృతంగానే ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆగస్టు 1న మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధించడమే ఈ మహాధర్నా ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తపస్ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, సభ్యులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై మహాధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆనందం, నియోజకవర్గ కన్వీనర్ చంద్రశేఖర్, యాలాల మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం,పెద్దేముల్ మండల అధ్యక్షుడు సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి అనిల్, బషీరాబాద్ మండల అధ్యక్షుడు వీరేశం, తాండూరు మండల అధ్యక్షుడు రవికుమార్, ఎం. శ్రీనివాస్, రాజు, కొత్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# కష్టపడిన బీఎల్ఏలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ మరువదు

- కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలకు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి దిశానిర్దేశం
- 52% శాతం పురోగతితో తాండూరు ముందంజ
- ప్రతి ఓటును క్షేత్రస్థాయిలో పరిశీలించాలి
- డిజిటలైజేషన్ వేగవంతం చేయాలని సూచన
- అభివృద్ధి, సంక్షేమంపై ఎమ్మెల్యే వివరణ
- కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపు
- పెద్దేముల్ మండల కేంద్రంలో సర్ ప్రక్రీయపై బిఎల్ఏలతో సమీక్షా సమావేశం

**పెద్దేముల్, జులై 23 (ప్రజాక్షేత్రం):**

సర్ ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు అప్రమత్తంగా వ్యవహరించి ప్రతి ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని,ఎట్టి పరిస్థితుల్లోనూ బీఎల్ఓలను పూర్తిగా నమ్మి నిర్లక్ష్యం చేయవద్దని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సూచించారు.గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎన్.ఎల్లారెడ్డి నివాసంలో పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి .మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్ ప్రక్రియ సమీక్ష సమావేశంలో తాండూరు నియోజకవర్గం సర్ కన్వీనర్ కరణం పురుషోత్తం రావుతో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొని బీఎల్ఏలకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ...భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రతి భారతదేశ పౌరుడికి అందించిన అత్యంత విలువైన హక్కు ఓటు హక్కు అని గుర్తు చేశారు.ప్రతి ఓటు వజ్రాయుధం లాంటిదని,ఓటు హక్కును పరిరక్షించడం ప్రజాస్వామ్య పరిరక్షణతో సమానమన్నారు.రేషన్ కార్డులలతో పాటు వివిధ రకాల సంక్షేమ పథకాల అమలులో కూడా ఓటరు వివరాలు కీలకమవుతున్న నేపథ్యంలో ప్రతి ఓటును జాగ్రత్తగా కాపాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా సర్ ప్రక్రియ పురోగతిలో తాండూరు నియోజకవర్గం 52% శాతం పురోగతితో ముందంజలో ఉందని, ఇందుకు క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్న తాండూరు నియోజకవర్గంలో ఉన్న 269 మంది బీఎల్ఏల సేవలు కారణమని, ఆ క్రెడిట్ వారికే దక్కుతుందని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అభినందించారు. మిగిలిన 5,6 రోజులు మరింత శ్రమించి సర్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని కోరారు.కష్టపడి పనిచేసే బీఎల్ఏలను పార్టీ ఎప్పటికీ మరవదని, భవిష్యత్తులో వారికి తగిన గుర్తింపు, అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, భవనాలు తదితర మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాల ద్వారా నిరుపేదలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.



తాండూరు నియోజకవర్గ సర్ కన్వీనర్ కరణం పురుషోత్తంరావు మాట్లాడుతూ....కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు,కాంగ్రెస్ నాయకులు, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ సర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.డిజిటలైజేషన్ పనులను మరింత వేగంగా పూర్తి చేయడంతో పాటు ప్రతి పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన ఓటరు వివరాలను రిజిష్టర్లలో కచ్చితంగా నమోదు చేయాలని కోరారు. తాండూరు నియోజకవర్గం రాష్ట్రస్థాయిలో 52% శాతం పురోగతితో ముందంజలో ఉండడం సంతోషకరమని అన్నారు, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.1,200 కోట్ల నిధులు తీసుకువచ్చి రోడ్లు, వివిధ రకాల భవనాలు, ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నారని తెలిపారు. సర్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని బీఎల్ఏలకు సూచించారు.ఈ సమావేశంలో తాండూరు నియోజకవర్గ సర్ కన్వీనర్ కరణం పురుషోత్తంరావు,పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.మహిపాల్ రెడ్డి,పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ఆయా గ్రామాల బీఎల్ఏలు, పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల పక్షాన నిలిస్తే అరెస్ట్ చేస్తారా మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

**నిర్మల్ జిల్లా జూలై 23(ప్రజాక్షేత్రం):**

దేశంలో కలకలం రేపిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి వ్యతిరేకంగా ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. భైంసా పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించిన భారీ నిరసన ప్రదర్శనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తును నమ్ముకున్న లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుకుంటోందని మండిపడ్డారు. పేపర్ లీక్‌పై న్యాయం కావాలంటూ ఢిల్లీ వేదికగా పోరాడుతున్న విద్యార్థులపై పోలీసులు అమానుషంగా లాఠీచార్జ్ చేయడం, వారికి అండగా నిలిచిన రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ ముఖ్య నాయకులను అక్రమంగా నిర్బంధించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని విఠల్ రెడ్డి ధ్వజమెత్తారు. కేంద్రంలోని పాలకుల నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భైంసాలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాయని ఆయన గుర్తు చేశారు. విద్యార్థుల హక్కుల కోసం, దేశ భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, రాహుల్ గాంధీ అరెస్ట్‌కు నిరసనగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ఈ సందర్భంగా హెచ్చరించారు.

# ఏసీబీ పట్టుకున్నా లెక్కలేదు

- విద్యుత్ ఉద్యోగుల అక్రమాలకు అడ్డుకట్ట పడేదెన్నడు?
- ప్రతి పనికి రూ.వేలల్లో లంచాల డిమాండు





విద్యుత్ ఉద్యోగుల అక్రమాలకు అంతులేకుండా పోయింది. ఈ శాఖలోని కొందరు ఉద్యోగులను అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు పట్టుకుంటున్నా ఏమాత్రం భయం కనిపించడం లేదు. పనుల కోసం వచ్చే ప్రజల నుంచి లంచాలు వసూలు చేస్తున్నారు. తాజాగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) ఉప ఇంజినీరు(డీఈ) ఇంటిపై ఏసీబీ దాడులు చర్చనీయాంశంగా మారింది. కొందరు ఇంజినీర్లు, ఉద్యోగులతోపాటు పొరుగుసేవల సిబ్బంది సైతం చేతివాటం ప్రదర్శించడం సర్వసాధారణంగా మారింది. ఇటీవల ఉత్తర తెలంగాణ డిస్కంలో పొరుగు సేవల ఉద్యోగి ఏకంగా సంస్థ అధికారుల లాగిన్లలోకి చొరబడి రూ.5 లక్షలను అక్రమంగా మంజూరు చేసుకున్నారు. జూన్‌లో హైదరాబాద్ ఐడీఏ బొల్లారం ప్రాంత విద్యుత్ ఇంజినీరు రామకృష్ణారెడ్డి రూ.25 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికారు. ఓ వ్యక్తి కరెంటు స్తంభాన్ని కారు ఢీకొన్నందుకు కేసు పెట్టకుండా ఉండాలంటే రూ.25 వేల లంచం డిమాండు చేసి ఈయన ఏసీబీ వలలో చిక్కారు.

**గుత్తేదారులతో కుమ్మక్కై...**

విద్యుత్ సంస్థల్లో పనులు చేసే గుత్తేదారులు, ప్రైవేటు కంపెనీల నుంచి ఉద్యోగులు లంచాలు వసూలు చేస్తున్నారు. ఇదే అవకాశంగా గుత్తేదారులు క్షేత్రస్థాయిలో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం కందనెల్లి ఫీడర్‌లో కరెంటు స్తంభంపై మంటలు రావడంతో సరఫరా నిలిపివేశారు. గుత్తేదారు ఒక యువకుడిని స్తంభంపైకి ఎక్కించి మరమ్మతు చేయిస్తుండగానే సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను ఆన్ చేశారు. యువకుడికి షాక్ తగిలి ప్రాణాపాయస్థితికి చేరుకోవడంతో స్థానికులు ఆందోళనకు దిగారు. ఇక్కడ స్తంభంపై మరమ్మతులకు ప్రైవేటు యువకుడిని ఎలా ఎక్కించారు... అక్కడి లైన్‌మెన్, ఇంజినీర్లు ఏం చేస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది.

**దగ్గర లేదని దూరం నుంచి...**

కొత్తగా నిర్మించే ఏదైనా అపార్ట్‌మెంటులో 50 ఫ్లాట్లు ఉన్నాయనుకోండి. ఒక్కోదానికి 5 కిలోవాట్ల సామర్థ్యంతో కరెంటు కనెక్షన్ కావాలని దరఖాస్తు చేయగానే అవినీతికి తెరలేపుతున్నారు. అంత ఎక్కువ లోడుతో కనెక్షన్లు ఇవ్వడానికి దగ్గరలోని ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం సరిపోదని, దూరంలో ఉన్న మరోచోట నుంచి సరఫరా చేయాలని చెపుతారు. దూరం నుంచి తీగలు లాగడానికి ఖర్చులు ఎక్కువగా చూపి... అవి తగ్గించాలంటే లంచాలు డిమాండు చేస్తున్నారు. కొత్త కనెక్షన్ ఇవ్వడానికి పనుల వ్యయంపై అంచనాలు వేసే విధానాలకు స్వస్తి చెపుతూ ఎల్‌టీ కేటగిరీలో యూనిఫామ్ లైన్ రుసుముల విధానాన్ని ప్రవేశపెట్టారు. దీని ప్రకారం కేటగిరీకి అనుగుణంగా కిలోవాట్‌కు రూ.1000 అదనంగా చెల్లించాలి. అప్పుడు డిస్కం సిబ్బంది వినియోగదారుడికి కనెక్షన్ ఇవ్వాలి. ఇదే విధానాన్ని హెచ్‌టీ కేటగిరీలోనూ ప్రవేశపెట్టేందుకు ఫిబ్రవరి మూడో వారంలో ప్రక్రియ ప్రారంభించినా ముందుకు సాగలేదు.

నామమాత్రంగా కాల్‌సెంటర్: దక్షిణ డిస్కం కార్యాలయంలో గతంలో ప్రత్యేక కాల్‌సెంటర్ ఏర్పాటు చేశారు. ఎవరైనా విద్యుత్ ఉద్యోగులు పనులు చేయకపోయినా, లంచాలు అడిగినా ఈ సెంటర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. దీనికి ఫోన్ చేస్తుంటే అవినీతిపై ఫిర్యాదులు తీసుకోవడంలేదని, ఆధారాలుంటే ఈమెయిల్ చేయాలని చెబుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



**ఎం రవీందర్**
**సీనియర్ జర్నలిస్ట్**
**7901503777**



## మహిళా నాయకురాలిపై పోలీసు దురుసు వైఖరి..!

- ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంది

**పెద్దపల్లి బ్యూరో, జూలై 23 (ప్రజాక్షేత్రం):**

ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి నిరసన తెలిపే హక్కు ఉందని, ప్రజలకు సేవ చేసిన ఒక మహిళా నాయకురాలితో ఏకవచనంలో, అవమానకరంగా మాట్లాడడం ఖండించదగ్గ విషయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒక ప్రధాన రాజకీయ పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన మహిళా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి కే ఇలాంటి పరిస్థితి ఎదురైతే, సామాన్య ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

'ఫ్రెండ్లీ పోలీసింగ్' అంటే ప్రజలతో గౌరవంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించడమేనని, బెదిరింపు ధోరణి లేదా అవమానకరమైన సంభాషణకు పోలీసు వ్యవస్థలో స్థానం ఉండకూడదని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజల పన్నుల ద్వారా జీతభత్యాలు పొందే అధికారులు చట్టానికి, రాజ్యాంగానికి లోబడి విధులు నిర్వహించాలని, అధికారాన్ని అహంకారంగా ప్రదర్శించడం తగదని పేర్కొంటూ ఈ ఘటనను ఖండించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి తెలిపారు.



## రక్షణ గోడను ప్రారంభించిన ఎమ్మెల్యే రామారావు పటేల్

**నిర్మల్ జిల్లా జూలై 23(ప్రజాక్షేత్రం):**



భైంసా మండలం దేగాం గ్రామ పంచాయతీ పరిధిలో విద్యా సంస్థల మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ చేపట్టిన అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన రక్షణ గోడను ముధోల్ నియోజకవర్గ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ రక్షణ గోడను విద్యార్థులకు, పాఠశాల సిబ్బందికి అంకితం చేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు విద్యా కమిటీ సభ్యులు మాట్లాడుతూ. పాఠశాలకు చుట్టూ సరైన రక్షణ గోడ లేకపోవడం వల్ల విద్యార్థులు ముఖ్యంగా విద్యార్థినులు ఎదుర్కొంటున్న భద్రతా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వారు తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేయించారని కొనియాడారు. రక్షణ గోడ నిర్మాణం పూర్తి కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, విద్యాభివృద్ధికి మరియు గ్రామాభివృద్ధికి నిరంతరం అండగా నిలుస్తున్న శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ కు గ్రామ ప్రజల తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో దేగాం సర్పంచ్ సుష్మా రెడ్డి, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు గ్రామస్తులు, యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పాడే మోస్తూ నిరసన తెలిపిన కొత్తూరు శంకర్

**నిర్మల్ జిల్లా జూలై 23(ప్రజాక్షేత్రం):**



కుబీర్ మండల కేంద్రంలో అత్యవసర వైద్య సేవల కోసం 108 అంబులెన్స్ వాహనాన్ని తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమకారుడు కొత్తూరు శంకర్ గురువారం ఒక వినూత్న నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలో అంబులెన్స్ సేవలు అందుబాటులో లేకపోవడంతో నిరుపేదలు గర్భిణులు అత్యవసర రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కొత్తూరు శంకర్ స్థానిక వివేకానంద చౌరస్తా వద్ద పాడెమోస్తూ విలపిస్తూ వినూత్న శైలిలో నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలో సకాలంలో అంబులెన్స్ అందక ఎంతో మంది అమాయక ప్రజలు, రోగులు ప్రాణాలు కోల్పోతున్నారని కన్నీటిపర్యంతమయ్యారు. పాలకులకు, అధికారులకు ప్రజల ప్రాణాలంటే పట్టింపు లేకుండా పోయిందని మండిపడ్డారు.సమయానికి వైద్యం అందక ప్రాణాలు పోతుంటే చూస్తూ తట్టుకోలేకపోతున్నామని, పాలకులు ఇప్పటికైనా తమ బాధలను, ప్రజా సమస్యలను గుర్తించాలని డిమాండ్ చేశారు. కుబీర్ మండల ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని, తక్షణమే ఇక్కడ ఒక 108 అంబులెన్స్ వాహనాన్ని శాశ్వతంగా ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని కొత్తూరు శంకర్ హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పలువురు నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం స్వామి వారిని దర్శించుకున్న రాష్ట్ర దేవాదాయ శాఖ డైరెక్టర్

**భద్రాచలం , జూలై 23 (ప్రజాక్షేత్రం)**



భద్రాచలంలోని శ్రీ సీతా రామచంద్రస్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. స్వామి వారి కల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణ దారణ, యజ్ఞోపవీతదారణ, జీలకరబెల్లం, మాంగల్య దారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. అలాగే స్వామి వారిని రాష్ట్ర దేవాదాయ శాఖ డైరెక్టర్ హన్మంతరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో బలిపీఠం వద్ద నమస్కరించి అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. చివరగా వేదపండితులు వేద ఆశీర్వచనం అందజేయగా, దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394